ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 21 నవంబరు 2024

• తారలు దిగి వచ్చిన వేళ

మచిలీపట్నంలో ఏర్పాటుచేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఈ షాపింగ్ మాల్‌ను ప్రారంభించగా, ప్రముఖ కథానాయికలు పాయల్ రాజ్‌పుత్, నయన్ సారిక సందడి చేశారు.





• కోటి కాంతులు

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మచిలీపట్నంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి కోటి దీపార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి పర్యవేక్షించగా, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, ఆలయ మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. - మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)

దాళ్వాకు దారేదీ..?

రబీ సీజన్‌లో దాళ్వాపంటకు సాగునీటి విడుదలపై స్పష్టత కొరవడింది. ఈ అంశంపై స్పష్టత ఇస్తే డిసెంబరు మొదటి, రెండు వారాల్లో రైతులు నారుమడులు పోసి, సంక్రాంతికి వరినాట్లు పూర్తిచేస్తారు. అయితే, సాగునీటిని విడుదలచేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం, అధికారులు కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో శివారు ప్రాంత రైతులు అయోమయంలో పడ్డారు.



జిల్లాలో సాగునీటి విడుదలపై కొరవడిన స్పష్టత

ప్రభుత్వ నిర్ణయం కోసం శివారు రైతుల ఎదురుచూపులు

- ఐఏబీ సమావేశంపై కూడా లేని స్పష్టత
- చాలాచోట్ల ఆలస్యంగా సాగు చేసిన వరి
- పొట్టదశకు చేరిన పైరు.. ఆందోళనలో అన్నదాతలు
- జనవరి నెలాఖరు వరకు సాగునీరు కావాల్సిందే..
- నీటిని విడుదల చేయాలంటూ శివారు రైతుల దీక్షలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : సాధారణంగా వేసవిలో సముద్రతీరం వెంబడి ప్రాంతాల్లోని చెరువులను నింపేందుకు ఫిబ్రవరి నుంచి మే వరకు రెండు విడతల్లో కాల్వలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో సాగు, తాగునీటి విడుదలపై తగు నిర్ణయం తీసుకునేందుకు ఏటా నవంబరు మూడో వారంలోనే సాగునీటి సలహామండలి (ఐఏబీ) సమావేశం నిర్వహిస్తారు. కానీ, ఇప్పటివరకు ఈ సమావేశంపై స్పష్టత లేదు.

దుబ్బు తొడిగే దశలో వరి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో జూన్ నుంచి ఆగస్టు మధ్య అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదురయ్యాయి. జూలైలో నీటి ఎద్దడి తలెత్తింది. దీంతో కాల్వ చివరి భూములకు సాగునీరు అందలేదు. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదటివారంలో కురిసిన భారీవర్షాలు, బుడమేరు వరద కారణంగా నాట్లు వేసిన పొలాలు నీటమునిగి వరిపైరు చనిపోయింది. దీంతో రైతులు సెప్టెంబరులో రెండోవిడత వరినాట్లు వేశారు. కాల్వ ఎగువ ప్రాంతంలో, బోరునీటి ఆధారంగా ముందస్తుగా సాగుచేసిన వరిపైరు ప్రస్తుతం కోతదశలో ఉంది. కాల్వ శివారు ప్రాంతాల్లో రెండోసారి వరినాట్లు వేసిన పొలాల్లోని వరిపైరు పిలకలు పొట్టదశలో ఉన్నాయి. ఎగువ ప్రాంత రైతులు మరో పది రోజుల తరువాత పొలాలకు సాగునీటికి వినియోగించరు. దిగువప్రాంతంలో ఆలస్యంగా వరినాట్లు వేసిన పొలాలకు జనవరి నెలాఖరు వరకు కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేస్తేనే పంట చేతికొచ్చే అవకాశముంటుంది.

వ్యవసాయ శాఖ సమాయత్తమేనా?

దాళ్వాకు సాగునీటిని విడుదల చేస్తే సబ్సిడీపై ఏపీ సీడ్స్ నుంచి వరి విత్తనాలను ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సమాయత్తం కావాలి. లేదా ఇప్పటికే ఇండెంట్ పెట్టి ఉండాలి. సాగునీటి విడుదలపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఏం చేయాలనే అంశంపై అధికారులు సైతం తర్జనభర్జన పడుతున్నారు. రబీలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఇప్పటికే నీటిపారుదల శాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతూనే, దాళ్వాకు సాగునీటిని విడుదల చేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంటున్నారు. పులిచింతల ప్రాజెక్టులో ఉన్న నీటిని రబీకి వినియోగిస్తే వచ్చే ఖరీఫ్‌కు.. అంటే జూన్‌లో సాగునీటిని విడుదల చేయలేమని అంటున్నారు. కాగా, జిల్లాలో ఈ రబీలో వరిసాగుకు, వేసవిలో తాగునీటి అవసరాలకు 35 టీఎంసీల నీరు అవసరముంది.

వర్షాల హెచ్చరికలతో బెంబేలు

ఈ నెల 23 నుంచి కోస్తాతీరం వెంబడి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికతో రైతులు యంత్రాల ద్వారా వరికోతలు పూర్తిచేస్తున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న ఎంటీయూ1061 రకం వరిపైరు వర్షం కురిస్తే నేల వాలిపోతుందని రైతులు భయపడిపోతున్నారు. హడావిడిగా హార్వెస్టర్ల ద్వారా కోతలు పూర్తిచేస్తున్నారు. ఇది పూర్తయ్యాక పొలాలను దమ్ముచేసి మినుము విత్తనాలను రెండోపంటగా చల్లే అవకాశం ఉంటుందని అధికారులు, రైతులు చెబుతున్నారు. రబీలో మినుము విత్తనాలు చల్లిన 30 నుంచి 40 రోజుల వ్యవధిలోపు ఒకసారి పంట తడుపుగా నీటిని పెట్టాల్సి ఉంది. దీని నిమిత్తమైనా కాల్వలకు నీటిని విడుదల చేయాలి.

విత్తనాలు లేవ్..

ఈ రబీలో జిల్లాలోని అన్ని మండలాల్లో 1.10 లక్షల హెక్టార్లలో మినుము, గన్నవరం, బాపులపాడు, చల్లపల్లి, తోట్లవల్లూరు, ఉయ్యూరు, మోపిదేవి, ఘంటసాల తదితర ప్రాంతాల్లో 5 వేల హెక్టార్లలో మొక్కజొన్న, మరో 2,500 హెక్టార్లలో జొన్న, 3 వేల హెక్టార్లలో పెసర, మచిలీపట్నం, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లో వెయ్యి హెక్టార్లలో వేరుశెనగ, కంకిపాడు, గన్నవరం తదితర మండలాల్లో 5 వేల హెక్టార్లలో వరి సాగవుతుందని వ్యవసాయ అధికారుల అంచనా. 90 శాతం కంటే అధిక రైతులు ప్రైవేట్ వ్యాపారుల నుంచి మినుమును కొనాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. మినుము విత్తనాలు మిగతా 6లో..

పోలీసులకు చిక్కకుండా పాచికలు

అజ్ఞాతంలో ఉంటూ ఎత్తులు వేస్తున్న గౌతంరెడ్డి

- తొలుత అందరి కళ్లుగప్పి హైదరాబాద్‌కు పరార్
- అరెస్టు కాకుండా హైకోర్టులో పిటిషన్ దాఖలు
- కోర్టు ఉత్తర్వులతో విచారణకు తాత్కాలిక బ్రేక్
- కుమారుడి ద్వారా బీబీఏకు మరో లేఖ
- సెర్చ్ వారెంట్ లేని సోదాలపై బీబీఏ ఆగ్రహం
- విధులు బహిష్కరించి నిరసన



విజయవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా, ఆ స్థల యజమానిపై హత్యాయత్నానికి సుపారీ గ్యాంగ్‌ను పురమాయించిన వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి రోజుకో ఎత్తు వేస్తున్నాడు. అజ్ఞాతంలో ఉంటూనే వ్యవహారాలు నడుపుతున్నాడు. నకిలీ వీలునామాను తయారు చేసుకుని సత్యనారాయణపురంలోని గండూరి ఉమామహేశ్వరశాస్త్రి స్థలాన్ని గౌతంరెడ్డి కాజేసిన విషయం తెలిసిందే. ఇందులో బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. ఉమామహేశ్వరశాస్త్రి అలుపెరగని పోరాటం చేస్తుండటంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఇందుకోసం సుపారీ గ్యాంగ్‌తో దాడి చేయించాడు. ఇప్పటికే ఈ కేసులో చిల్లకల్లుకు చెందిన నలుగురు నిందితులను సత్యనారాయణపురం పోలీసులు అరెస్టు చేశారు. గౌతంరెడ్డితో పాటు ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ముఖ్యంగా కుట్రకు ప్రధాన సూత్రధారి గౌతంరెడ్డి కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన ఎక్కడెక్కడ తలదాచుకునే అవకాశాలు ఉన్నాయో అన్ని ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. పోలీసులు సాంకేతికంగా సాగించిన దర్యాప్తులో అతడు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు పారిపోయినట్టు తేలింది. ఆ తర్వాత నుంచి గౌతంరెడ్డి ఆచూకీ లభించలేదు. హైదరాబాద్‌లోనే ఎక్కడో ఒకచోట తలదాచుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

అరెస్టు చేయకుండా కోర్టులో పిటిషన్

తనను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని గౌతంరెడ్డి ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించాడు. దీనిపై కోర్టు మిగతా 6లో..

ఉచిత ఇసుక కోసం దారి



తోట్లవల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధికారిక ఇసుక క్వారీలు మరో మూడు, నాలుగు రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. ఉచిత ఇసుక నిమిత్తం తోట్లవల్లూరు మండలం నార్తువల్లూరులో మూడు క్వారీలు, రొయ్యూరులో రెండు క్వారీలు మంజూరయ్యాయని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. దీంతో ఈ క్వారీలకు వెళ్లేందుకు కరకట్ట వెంబడి ఉన్న నదీపాయలో కాంట్రాక్టర్ బుధవారం రహదారుల నిర్మాణం చేపట్టాడు. ఈ ఐదు క్వారీల నుంచి ఇసుకను స్టాక్‌యార్డులకు తరలించి వినియోగదారులకు అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రేషన్ కార్డుల మదింపు

జిల్లాలో పరిస్థితి రెండు రోజుల్లో తెలిసే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నకిలీ రేషన్ కార్డుల తొలగింపుపై కేంద్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తుండగా, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కొంతకాలం కిందట కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్-వన్ రేషన్ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రేషన్ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా నిత్యావసరాలు తీసుకునే అవకాశాన్ని కల్పించింది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎఫ్ఎస్ఏ)లో భాగంగా కార్డులను మంజూరు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొన్ని కార్డులను జారీ చేస్తుంటాయి. ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలో ఉన్న రేషన్ కార్డులను పెద్ద సంఖ్యలో తొలగించటమే ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆధార్‌కార్డుల అనుసంధానం, కేవైసీల ద్వారా నకిలీ రేషన్ కార్డులను గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్ని కార్డుల తొలగింపు జరిగిందన్నది మరో రెండు రోజులకు గానూ తెలిసే పరిస్థితి లేదు.

సైబర్‌కు షాక్

ఈ-నేరగాళ్లకు ఝలక్ ఇచ్చిన తాడిగడపవాసి



డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చిన వీడియో కాల్స్ మాట్లాడి రూ.1.25 కోట్లను సైబర్ నేరగాళ్లకు పంపి ఓ ఎన్ఆర్ఐ మహిళ అడ్డంగా ఇరుక్కున్న విషయం మరువకముందే.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా చాకచక్యంగా ఓ ఉద్యోగి తప్పించుకున్న తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

- కొరియర్ ట్రాకింగ్ కోసం కాల్‌చేసి ఇరుక్కున్న ఉద్యోగి
- లింక్ పంపి ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ సైకోలు
- ఆన్‌లైన్‌లో రూ.5 లక్షల ఇన్‌స్టా లోన్ పెట్టిన నేరగాళ్లు
- వరుస ఓటీపీలు రావడంతో అప్రమత్తమైన ఉద్యోగి
- చాకచక్యంగా కార్డు, అకౌంట్ల బ్లాక్
- నేరగాళ్లు పెట్టిన రుణం తన సేవింగ్ ఖాతాకే మళ్లింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో ఎక్కడో ఒకచోట, ఎవరో ఒకరు ఇరుక్కుని లక్షలాది రూపాయలను కోల్పోతున్నారు. ఇలా కొరియర్ ట్రాకింగ్ కోసం ఫోన్‌చేసి సైబర్ నేరగాళ్లకు చిక్కిన ఓ వ్యక్తి వెంటనే అప్రమత్తమై వారికే ఝలక్ ఇచ్చాడు. ఆయన క్రెడిట్‌కార్డు నుంచి డబ్బు లాగేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టిన సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా అన్ని మార్గాలను బ్లాక్ చేసి కంగు తినిపించాడు. వివరాల్లోకి వెళితే..

కొరియర్ కోసం కాల్ చేస్తే..

పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన నాగేశ్వరరావు బందరు రోడ్డులో ఉన్న స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో ఉద్యోగి. ఆయనకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి పార్శిల్ రావాల్సి ఉంది. ఈ నెల 14న రాజమండ్రిలో పార్శిల్‌ను డీటీడీసీ కొరియర్ చేశారు. 15వ తేదీన ఆఫీసుకు సెలవు. 16న చేరాల్సిన పార్శిల్ రాకపోవడంతో డీటీడీసీ వెబ్‌సైట్‌లో ఆర్డర్ నెంబర్ ద్వారా నాగేశ్వరరావు ట్రాక్ చేశారు. పార్శిల్ విజయవాడలో డెలివరీకి వచ్చినట్టు చూపించింది. ఎంతసేపటికి పార్శిల్ రాకపోవడంతో వెబ్‌సైట్‌లో దిగువన కాంటాక్ట్ అజ్.. అని పేర్కొంటూ ఫోన్ నెంబర్ ఇచ్చారు. దీంతో నాగేశ్వరరావు ఆ నెంబరుకు కాల్ చేశారు. అవతలి వ్యక్తి హిందీలో మాట్లాడుతూ మరో కాల్ వస్తుంది, దాంతో మాట్లాడమని చెప్పాడు. ఇలా ఫోన్ కట్ అవ్వగానే మరో నెంబర్ నుంచి నాగేశ్వరరావుకు ఫోన్ వచ్చింది. అతడు హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడి వేరే ఫోన్ నెంబర్ నుంచి వాట్సాప్ ద్వారా లింక్ పంపి, దాన్ని క్లిక్ చేయమన్నాడు. అనుమానం వచ్చిన ఆయన ఇది డీటీడీసీ కొరియరేనా.. అని ప్రశ్నించాడు. అవతలి వ్యక్తి అవునని సమాధానమిచ్చాడు. క్లిక్ చేయగానే ఓటీపీ వస్తుందని, వెంటనే చెప్పాలని అవతలి వ్యక్తి అడగ్గానే నాగేశ్వరరావు చెప్పేశారు. తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే ఆప్షన్లలో రూ.5 పంపితే, తిరిగి జమ అవుతాయని అవతలి వ్యక్తి వివరించాడు. ఇదంతా కన్ఫర్మేషన్ కోసమేనని నమ్మించాడు.

ఫోన్ హ్యాక్ చేసి ఇన్‌స్టా లోన్

నాగేశ్వరరావుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఉంది. దీని పరిమితి రూ.7 లక్షలు. ఆయనకు ఇదే బ్యాంక్‌లో సేవింగ్ ఖాతా కూడా ఉంది. క్రెడిట్ కార్డును ఆయన గూగుల్ పేకు అనుసంధానం చేసుకున్నారు. షాపింగ్‌కు వెళ్లినప్పుడు గూగుల్ పే ద్వారా ఆ కార్డు నుంచి చెల్లింపులు చేస్తుండేవారు. కొరియర్ కోసం ఫోన్ చేసినప్పుడు అవతలి వ్యక్తి డబ్బులు పే చేయమనగానే, ఈ కార్డు ద్వారా రూ.5 పంపారు. కాసేపట్లో కొరియర్ చేతికి అందుతుందని చెప్పి అవతలి వ్యక్తి ఫోన్‌ను మిగతా 6లో..

నెల్లూరు జైలుకు వంశీ అనుచరులు 6లో

రోడ్డు ప్రమాదం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



పంటు తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏటిమొగ-ఎదురుమొండి రేవు మధ్య
పంటు సేవలు నిలిపివేత

నాగాయలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏటిమొగ-ఎదురుమొండి గ్రామాల మధ్య రేవులో మరమ్మతుల కోసం పంటును నిలిపివేసినట్టు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు. బుధవారం నుంచి పంటు స్థానంలో రెండు బోట్లు సంగటి కంటి ప్రజారవాణాకు అనుమతిచ్చి తహసీల్దార్, పోలీసులు, గ్రామస్థులు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, మరమ్మతుల నిమిత్తం కొద్ది రోజులు పంటును నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ సమయంలో బోటులో ప్రయాణానికి మనిషికి రూ.10, రెండు చక్రాల బండికి రూ.50గా ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీసు, మత్స్యశాఖలతో కూడిన కమిటీ నిర్ణయించినట్టు తహసీల్దార్ తెలిపారు. సంగడి బోట్లతో ఓవర్ లోడ్ చేయవద్దని బోట్ల యాజమాన్యాన్ని ఆయన హెచ్చరించారు.



భూమిపూజ చేసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

దేవాలయ వ్యవస్థ ప్రక్షాళన అవసరం

» మోపిదేవిలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నిధులు రూ.2.75 కోట్లతో కోనేరు వద్ద షాపింగ్ కాంప్లెక్స్, విశ్రాంతి గదుల నిర్మాణాలకు బుద్ధప్రసాద్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన మోపిదేవి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మోపిదేవి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. ఇటీవలి కాలంలో దేవస్థానాలు, నిర్వహణ తీరుపై వస్తున్న అభియోగాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమగ్రమైన విచారణ చేసి భక్తులకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. దేవదాయశాఖ వ్యవస్థలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, గ్రామసర్పంచ్ నందిగం మేరీ రాణి, నేతలు మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.



పాత్రోకాల్ రగడ

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై టీడీపీ ఎంపీటీసీ అయిన తన పేరు లేకపోవటం, కనీస సమాచారం కూడా ఇవ్వలేదని దేవస్థానం ఉద్యోగులు ఇంకా వైసీపీ మత్తులోనే ఉంటున్నారని కొమ్ము పవన్‌కుమార్ ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

నెల్లూరు జైలుకు వంశీ అనుచరులు

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత కాసన్నేని రంగబాబుపై దాడి ఘటనలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు ఎనిమిది మందిని అరెస్టు చేసి 14రోజులు రిమాండ్ విధిస్తూ గన్నవరం సబ్‌జైల్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ ఇప్పటికే ఎక్కువమంది ఉన్నారని జైల్ సూపరింటెండెంట్ రాంబాబు గన్నవరం కోర్టులో పిటీషన్ వేశారు. పిటీషన్‌ను స్వీకరించిన మెజిస్ట్రేట్ వారిని నెల్లూరు సబ్‌జైల్‌కు తరలించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో బుధవారం రాత్రి నిందితులను ఎస్కార్ట్ సహాయంతో నెల్లూరు జైలుకు పంపారు. ఇదిలా ఉండగా పోలీసులు నిందితులను కస్టడీకి ఇవ్వాలంటూ పిటీషన్ వేశారు. అలాగే నిందితుల తరపున న్యాయవాదులు బెయిల్ పిటీషన్ వేశారు. వాటిపై గురువారం విచారణ జరగనుంది.

దేవస్థానం భూమి కబ్జా చేయలేదు

» నిబంధనల ప్రకారమే కౌలుకు తీసుకున్నా
» అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య

వన్‌టౌన్: అంబాపురంలోని శ్రీదాసాంజనేయ దేవస్థానానికి చెందిన ఎకరం పది సెంట్లు భూమిని దేవస్థానం నిబంధనల ప్రకారమే కౌలుకు తీసుకున్నాను తప్ప, కబ్జా చేయలేదని అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య తెలిపారు. మంగళవారం అంబాపురంలో దేవస్థానం కమిటీతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ దేవస్థానం కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో దేవస్థానానికి చెందిన 4 ఎకరాల 90 సెంట్ల భూమిలో ఎకరం పది సెంట్లు ఏడాదికి నెలకు సుమారు 65 వేల రూపాయలు చెల్లించి కౌలుకు తీసుకున్నట్టు చెప్పారు. గ్రామంలో కొందరు కావాలని తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. దేవస్థానం కమిటీ కోశాధికారి వసంతకుమార్ మాట్లాడుతూ, సర్పంచ్ సీతయ్యకు నిబంధనల ప్రకారమే ఎకరం పది సెంట్లు భూమిని పదేళ్ల పాటు కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అయితే రికార్డులలో భూమి ఎలా మారిందన్న దానిపై మాత్రం వారు వివరణ ఇవ్వలేదు.

దాళ్వాకు దారేది..?

(5వ పేజీ తరువాయి)

సబ్సిడీపై ఇవ్వాల్సి వస్తే డిసెంబరు మొదటివారం నాటికి సిద్ధం చేస్తామంటున్నారు.

రైతుల రిలేదీక్షలు

దాళ్వాపంటకు సాగునీటిని విడుదల చేయాలని సముద్రతీర ప్రాంతంలోని మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు తదితర మండలాల రైతులు.. పాలకులు, అధికారులను కోరుతున్నారు. తీర ప్రాంతాల్లోని భూముల్లో మినుము పంట పండదని, దాళ్వాకు నీరివ్వకపోతే భూములు చౌడుబారిపోతాయని మంత్రి కొల్లు రవీంద్రకు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు, కలెక్టర్ బాలాజీకి బంటుమిల్లి, కృత్తివెన్ను, మచిలీపట్నం మండలాలకు చెందిన రైతులు నెల రోజులుగా దశలవారీగా వినతిపత్రాలు అందజేశారు. తొమ్మిది రోజులుగా బంటుమిల్లిలో రైతులు రిలేదీక్షలు కూడా చేస్తున్నారు. బంటుమిల్లి మండలానికి చెందిన రైతులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాసరావుకు కూడా వినతిపత్రం అందజేశారు.

ఆశలు ఆవరి!

అన్నదాత విలవిల

» పంట చేతికొచ్చే సమయానికి తుపాను దెబ్బ!
» గాలులకు నేల వాలిన వరి పంట
» కూలీల కొరత.. అందుబాటులో లేని యంత్రాలు
» చేలల్లోనే పంట వదిలేస్తున్న రైతులు



పంట నేలకొరగటంతో కోయకుండా వదిలేసిన రైతు

కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలం

ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలవాలటంతో రైతులు దిగాలు పడుతున్నారు. కోతకు వచ్చిన పంటను కోసేందుకు కూలీల కొరతతో యంత్రాలపై ఆధారపడుతున్నారు. యంత్రాలు కూడా అందుబాటులో లేకపోవటంతో తలలు పట్టుకుంటున్నారు. కోత మిషన్‌తో కోయిద్దామన్నా భూమిలో గట్టిదనం లేక యంత్రాల చక్రాల కింద పంట నలిగిపోతుండటంతో పొలాలను పంటతో సహా చేలల్లోనే రైతులు వదిలేస్తున్నారు.

(జగ్గయ్యపేట రూరల్, ఆంధ్రజ్యోతి)

ఇటీవల వచ్చిన తుపాను గాలులకు కోతకు వచ్చిన వరి నేలకొరగటంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నేలపై పడిన వరిని కూలీలు ఇబ్బంది లేకుండా కోస్తారు. కానీ.. ప్రస్తుతం కూలీల కొరత.. యంత్రాలతో కోయటం.. పొలాలు ఆరకపోవటంతో పంట నలిగి గ్రాసం (వరి గడ్డి) కూడా బురదతో పనికి రాకుండా పోతున్నది. అనుమంచిపల్లి ఆర్‌బీకే పరిధిలో 1683 ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. ఆది నుంచి వర్షాలు అదునుకు కురవక, సాగర్ జలాలు రాక అరకొరగా ప్రారంభమైన సాగు వరదలతో ఆటుపోట్లకు గురైనా రైతులు నిరాశ చెందలేదు. నాటుకు రూ. 5వేలు, సస్యరక్షణ, బలం, తదితర మందులకు రూ. 5వేలు, ట్రాక్టర్ దుక్కులకు రూ. 7వేలు, కౌలు రూ.21వేల చొప్పున ఖర్చుచేసి మరీ సాగుచేశారు. పంట చేతికి వస్తుందన్న సమయంలో అధిక వర్షాలు, గాలుల కారణంగా నేలకొరగటం భూమి గట్టిగా లేకపోవటంతో అదే సమయంలో కూలీల కొరత కారణంగా యంత్రాలతో కోయించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఎకరా పంటను గంటలో కోసే యంత్రాలు ప్రస్తుతం మూడు, నాలుగు గంటలు పడుతుండటంతో అదనంగా మరో రూ.9వేలు చెల్లించాల్సి వస్తున్నది. పంటను కోయించినా పశుగ్రాసం నేలపాలవుతుంది. మరోవైపు యంత్రాల కొరతతో పంటలు మొలకెత్తుతున్నాయి. నేల గట్టిగా ఉంటే రోజుకు 20 ఎకరాలు కోసే యంత్రాలు ప్రస్తుతం నాలుగైదు ఎకరాలకు మించి కోయటం లేదని రైతులు అంటున్నారు.

15 ఎకరాలు సాగు చేశా

- కొడాలి శంకరయ్య, రైతు



రూ.5 లక్షల పెట్టుబడి పెట్టి 15 ఎకరాలు సాగు చేశా. నేల గట్టి పడకపోవటంతో రెండెకరాల్లో పంటను వదిలేయాల్సి వచ్చింది. పంటను మార్కెట్‌కు తరలించినా రూ. 2లక్షలకు మించి వచ్చేలా లేదు. పశుగ్రాసం కూడా నేలపాలైంది.

ఖర్చులు అధికంగా ఉన్నాయి

- సాయి కిరణ్, రైతు



పంట కంటే ఖర్చులే అధికంగా ఉన్నాయి. పంట నేలకొరగటంతో యంత్రాలతో కోయిస్తే రూ. 16 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు 20 బస్తాల దిగుబడి కూడా వచ్చేలా లేదు. వరి పొలాలు కోత కోయించటం కంటే వదిలేయటమే మంచిదని సాగు చేసిన నాలుగెకరాల పంటను వదిలేశా. ప్రభుత్వం రైతులకు రాయితీపై వరి కోత యంత్రాలను అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

అసెంబ్లీ వేదికగా

'కొండపల్లి' వెతలు తీర్చండి!

» ఎమ్మెల్యే వసంత



ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొండపల్లి మున్సిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం అసెంబ్లీ వేదికగా రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణను కోరారు. మైలవరం నియోజకవర్గంలో ఉన్న ఏకైక మున్సిపాలిటీ కొండపల్లి అని.. దానిని 2020లో డిసెంబర్‌లో ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు అనుగుణంగా సేవలందించేందుకు వివిధ విభాగాల్లో పని చేయడానికి ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది లేరన్నారు. నిధులు కొరత ఉందన్నారు. తక్షణమే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని కోరారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఇంటింటికి కుళాయి పథకానికి మరలా టెండర్లు పిలవాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే పీఎం జనఔషధి మందులు పెట్టండి

» శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట : ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రభుత్వాసుపత్రుల ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, మందులపై జనరిక్ అని ముద్రించటం లేదని, బ్రాండెడ్ మందులకు వాటికి వ్యత్యాసం ఉండేలా ధరల్లోను తేడా ఉంచాలని కోరారు. ప్రజలకు బ్రాండెడ్, జనరిక్‌పై అవగాహన కల్పించాలని కోరారు. జనరిక్ షాపుల్లో బ్రాండెడ్ మందుల విక్రయాలు చేయకుండా చూడాలన్నారు.

తిరువూరుకు రైలు మార్గం కల్పించండి

» కొలికపూడి శ్రీనివాసరావు



తిరువూరు : కేంద్ర ప్రభుత్వం అమరావతిని కలుపుతూ నూతన రైలుమార్గాన్ని ఆమోదించిందని, దానికి తిరువూరు మీదుగా ఉండేలా సవరణ చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ప్రాంత అభివృద్ధి రవాణమార్గంపై ఆధారపడి ఉంటుందన్నారు. తిరువూరు నియోజకవర్గం సమీపంలోని పలు పట్టణాలకు రైలు మార్గం ఉందని, తిరువూరు మీదుగా రైలుమార్గం, స్టేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందించేలా సహకరించాలని కోరారు.,

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం

» గత ప్రభుత్వ వైఫల్యాల దృష్ట్యా అన్ని ఏర్పాట్లు.. » గ్రామాల్లో సమాచార సేకరణలో సిబ్బంది » ఆర్డీవో బాలకృష్ణ వెల్లడి

నందిగామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నందిగామలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో మొత్తం 54 సేకరణ కేంద్రాలు, ఆరుమిల్లలను సిద్ధం చేసింది. బీపీటీ రకం క్వింటాకు రూ.2,320గా నిర్ణయించారు. తేమ శాతం 17 వరకూ ఉండవచ్చని స్పష్టం చేసింది. తేమ శాతం పెరిగితే ఒక్కొక శాతానికి కిలో చొప్పున గరిష్ఠంగా ఐదుకిలోలు మాత్రమే తగ్గించేలా నిబంధన విధించి పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది నూర్పిళ్ల సమాచారం సేకరిస్తున్నారు. రైతు ప్రాతిపదికగా ధాన్యం చేతికి వచ్చే సమయాన్ని తెలుసుకొని వారికి కొనుగోలు తేదీని చెబుతున్నారు. దీనివల్ల రైతులకు సమయం వృథా కాకుండా ఉంటుంది. ధాన్యం సేకరణ జరిగిన 48 గంటల్లో రైతు ఖాతాలోకి నగదు జమయ్యేలా చర్యలు చేపట్టినట్టు ఆర్డీవో తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

వైసీపీ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర కష్టాలు!

గత ప్రభుత్వ హయాంలో సేకరించిన ధాన్యానికి సకాలంలో సొమ్ము చెల్లింపులు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఆర్బీకేలు మొత్తం వైసీపీ నేతలు తమ అధీనంలోకి తీసుకొని రైతులకు ఉచితంగా అందించాల్సిన గన్నీ బ్యాగ్‌లను అమ్ముకొని సొమ్ము చేసుకున్న ఘటనలున్నాయి. కాటాల కోసం రైతులు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. తీరా కాటాలకు వచ్చే సమయంలో మరో మారు తేమ పరీక్షలు నిర్వహించి అదనపు కోతలు విధించే వారు. నాటి పాలకులు, అధికారులు, సిబ్బంది కలిసి అన్నదాతను అష్టకష్టాలకు గురిచేశారు. ఈ వెతలు పడలేక రైతులు గ్రామాలలో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. పలుచోట్ల సిబ్బందిని నిర్బంధించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గత అనుభవాలు తలెత్తకుండా చర్యలు చేపడుతోంది. తిరువూరు డివిజన్‌లో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్న ప్రభుత్వం రైతుల నుంచి సమర్థవంతంగా కొనుగోళ్లు చేస్తూ.. 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమౌతున్నట్టు సమాచారం. ఈ మేరకు బుధవారం ఆర్డీవో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలందించడం ద్వారా దళారులను ఆశ్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉన్నందున క్రమ పద్ధతిలో రైతులకు అందించాలని ఆదేశించారు. కాటాలు, తేమ శాతం విషయాలలో ఎక్కడ అవకతవకలు జరిగినా అధికారులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా క్రమ పద్ధతిని పాటించి మంచి ధర అందుకోవాలని సూచించారు.

వీఆర్వో అశోక్ సేఫ్

» ఊపిరి పీల్చుకున్న తహసీల్దార్, ఆర్ఐలు

ఇబ్రహీంపట్నం/నందిగామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'నా చావుకు కారణం ఇబ్రహీంపట్నం తహసీల్దార్, ఆర్ఐలే కారణం' అని సోమవారం రాత్రి లేఖ రాసి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇబ్రహీంపట్నం సచివాలయం- 4 వీఆర్వో పెసరమిల్లి అశోక్ నందిగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ప్రత్యక్షం కావడంతో ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తన భర్త కనిపించడం లేదని వీఆర్వో భార్య ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వారు అశోక్ కోసం గాలింపు చేపట్టారు. అయితే వీఆర్వో సంక్షేమ సంఘ నేతలతో కలిసి నందిగామ ఆర్డీవో ఎదుట ప్రత్యక్షమయ్యాడు. పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి కారణంగా అశోక్ అలా సూసైడ్ లేఖ రాసి రెండ్రోజుల పాటు బంధువుల ఇళ్లకు వెళ్లాడన్నారు. కుటుంబసభ్యుల ద్వారా అతడ్ని తీసుకొని ఆర్డీవో వద్దకు వచ్చామన్నారు. ఈ సమస్యకు ఇంతటితో ముగింపు పలికామన్నారు. దీనిపై ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. అతడ్ని ఈనెల 5నే కలెక్టరేట్‌కు సరెండర్ చేశామని ఏదైనా అతడిపై చర్యలు తీసుకోవాలంటే వారు తీసుకోవాల్సిందే తప్ప మాకెలాంటి సంబంధం లేదన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద అశోక్‌బాబు

రోడ్డు ప్రమాదంలో
సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మణికంఠ (ఫైల్)

ఉంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చెన్నై-కోల్‌కతా 16వనెంబర్ జాతీయరహదారిపై పెదఅవుటపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం చెందాడు. ఆత్కూరు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన కె.మణికంఠ(35) బెంగుళూరుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇంటివద్దనుంచి(వర్క్‌ఫ్రమ్ హోం)ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నాడు. విజయవాడ ఆంధ్రహాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు ఇటీవల కొత్తగా కొనుగోలుచేసిన తన స్పోర్ట్స్ బైక్‌పై ఉదయం 9గంటలకు ఇంటినుంచి బయలుదేరాడు. 11గంటల సమయంలో పెదఅవుటపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన పార్క్‌చేసిన వ్యాన్‌ను వెనుకనుండి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు, చేతులకు తీవ్రగాయాలైన మణికంఠ రక్తపుమడుగులో అక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న ఆత్కూరు ఎస్సై సురేష్ సిబ్బందితో హుటాహుటిన ప్రమాదస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారకుడైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదుమేరకు ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డిసెంబరు 15 వరకు బ్రూసెల్లోసిస్ టీకా కార్యక్రమం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆడ పశువుల్లో గర్భస్రావానికి, మగ పశువుల్లో కీళ్ల వాపులు, వంధ్యత్వానికి కారణమయ్యే బ్రూసెల్లోసిస్ వ్యాధి నియంత్రణకు డిసెంబరు 15 వరకు బ్రూసెల్లోసిస్ టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా పశుసంవర్థక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పశువుల నుంచి మనుషులకు సోకే గుణం ఈ వ్యాధికి వుందని, పశువ్యాధుల నియంత్రణ కార్యక్రమం ద్వారా 4-8 నెలల వయసు ఆడదూడలకు టీకా వేయడం జరుగుతుందని పశుసంవర్థక శాఖ జేడీ ఎం.హనుమంతరావు వివరించారు. ఒకసారి టీకా వేస్తే జీవితంలో మరెప్పుడూ వ్యాధి రాదని పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ గోపీచంద్, సీడీఓ వెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం : ఎంపీ కేశినేని శివనాథ్

తిరువూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్‌గా శావల దేవదత్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ కేశినేని చిన్ని హాజరై దేవదత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కూటమి అభ్యర్థుల విజయంలో దేవదత్ కృషి, త్యాగం మరువలేనిదన్నారు. కేంద్ర పథకాలు క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా ఉందని, వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని ఎంపీ పేర్కొన్నారు. దేవదత్ మాట్లాడుతూ, ప్రభుత్వం తనకు అప్పగించిన బ్యాధతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు, తల్లి

డీజిల్ పోసి తగలెడతా!

» బయానా సొమ్ము అడిగినందుకు వైసీపీ నేత బెదిరింపులు
» ప్రాణహాని ఉందని పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కంచికచర్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న బయానా డబ్బులు తిరిగి ఇవ్వాలన్నందుకు కీసర గ్రామానికి చెందిన వైసీపీ నేత జడ్పీటీసీ ప్రశాంతి భర్త వేల్పుల రమేశ్ తనపై డీజిల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడని కీసర గ్రామానికి చెందిన బాధితుడు అంగిరేకుల రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొలం కొనుగోలు చేసేందుకు ఆరేళ్ల క్రితం బాధితుడు రమేశ్‌ను సంప్రదించగా ఆయన బంధువుల పొలాన్ని చూపి బయానాగా రూ.5.5 లక్షలు ఇప్పించాడు. తర్వాత పలుమార్లుగా రూ.11.75 లక్షలు తన వద్ద తీసుకున్నాడని బాధితుడు వాపోయాడు. పొలం రిజిస్ట్రేషన్ చేయించాలని రమేశ్‌ను అడగ్గా కాలయాపన చేస్తున్నాడని, దీనిపై పొలం అమ్మకందార్లను సంప్రదించగా రమేష్ ఇప్పటి వరకు ఎలాంటి సొమ్ములు తమకు ఇవ్వలేదని యజమానులు తెలపడంతో మోసపోయానని గ్రహించి ఇచ్చిన బయానా సొమ్మును తిరిగి ఇవ్వాలని రమేశ్‌ను అడగ్గా వాయిదా వేస్తున్నాడే తప్ప సొమ్ములు ఇవ్వలేదన్నాడు. పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టినా ఫలితం లేదన్నాడు. మంగళవారం రాత్రి తనను ఇంటికి పిలిచి తీవ్ర ఆగ్రహంతో 'నీకెంత ధైర్యంరా నాపైనే పంచాయతీ పెడతావా'.. అంటూ బెదిరించి డీజిల్ పోసి తగలెడితే ఎవరు నిన్ను కాపాడతారో చూస్తా.. అని బెదిరించడంతో భయంతో 100కు ఫోన్ చేశానని, కానిస్టేబుల్ వచ్చి స్టేషన్‌కు తీసుకువచ్చారని పేర్కొన్నాడు. జరిగిన ఘటనపై లిఖిత పూర్వకంగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వేల్పుల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పోలీసులకు చిక్కకుండా..

(5వ పేజీ తరువాయి)

ఇంటెరిమ్ ఉత్తర్వులు ఇవ్వడంతో పోలీసులు ముందుకు వేయాల్సిన అడుగులను తాత్కాలికంగా ఆపారు. గౌతంరెడ్డి కాకుండా అతడి డ్రైవర్ బండ శ్రీను, న్యాయవాది పృథ్వీరాజ్, అనుచరుడు బిట్ర పురుషోత్తమరావు పరారీలో ఉన్నారు. గౌతంరెడ్డికి కోర్టు ఉత్తర్వులు ఉన్నందున ఆయన జోలికి పోలీసులు వెళ్లడం లేదు. మిగిలిన వారిని పట్టుకునే పనిలో పడ్డారు.

స్పందించిన బీబీఏ

హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గౌతంరెడ్డికి బీబీఏ మద్దతు ప్రకటించింది. వాస్తవానికి గౌతంరెడ్డి రాసిన లేఖను ఆయన జూనియర్ ఈనెల ఏడో తేదీన బీబీఏకు అందజేశాడు. అప్పటి నుంచి బీబీఏ ఎలాంటి అడుగు ముందుకు వేయలేదు. తాజాగా గౌతంరెడ్డి కుమారుడు బీబీఏకు మరో లేఖ రాసినట్టు సమాచారం. దీనికి బీబీఏ స్పందించింది. విజయవాడలో ఉన్న న్యాయస్థానాలను బుధవారం న్యాయవాదులు బహిష్కరించారు. ఎలాంటి సెర్చ్ వారెంట్ ఇవ్వకుండా పోలీసులు గౌతంరెడ్డి ఇంట్లోకి ప్రవేశించడాన్ని బీబీఏ ఖండించింది. పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా విధులను బహిష్కరించినట్టు బీబీఏ ప్రతినిధులు తెలిపారు.

సైబర్‌కు షాక్

(5వ పేజీ తరువాయి)

పెట్టేశాడు. కొద్దిసేపటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి ఓటీపీలు, సందేశాలు వరుసగా వచ్చాయి. అందులో రూ.5 లక్షలను ఉపయోగించినట్టు ఒక సందేశం ఉంది. అనుమానం వచ్చిన నాగేశ్వరరావు కార్డు పరిమితిని పరిశీలించుకోగా, అందులో రూ.లక్ష మాత్రమే చూపిస్తోంది. రూ.6 లక్షలకు గాను రూ.5 లక్షలు ఉపయోగించినట్టు చూపించింది. తాను సైబర్ నేరగాళ్ల ట్రాప్‌లో ఇరుక్కున్నానని తెలుసుకున్న నాగేశ్వరరావు బ్యాంక్‌కు వెళ్లి విషయం చెప్పారు. కార్డును బ్లాక్ చేయమన్నారు. అయితే, అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి అటువంటిదేమీ లేదని చెప్పారు. తర్వాత క్రెడిట్‌కార్డు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా ఇదే సమాధానం వచ్చింది. లింక్ ద్వారా నాగేశ్వరరావు ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డుపై ఇన్‌స్టా లోన్‌కు దరఖాస్తు చేశారు. ఇది మూడు దశల్లో ఉంటుంది. ప్రతి దశలోనూ ఓటీపీ ఎంటర్ చేయాలి. నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడుతుండగానే సైబర్ నేరగాళ్లు ఈ ప్రక్రియ పూర్తిచేశారు. ఇన్‌స్టా రుణానికి సంబంధించిన డబ్బు ఆ బ్యాంక్‌లో ఉన్న అకౌంట్‌లో జమ అవుతాయి. ఆవిధంగానే రూ.5 లక్షలు నాగేశ్వరరావు అకౌంట్‌లో జమ అయ్యాయి. ఇది వెంటనే అప్‌డేట్ కాకపోవడంతో బ్యాంక్, కాల్ సెంటర్ సిబ్బందికి వెంటనే చూపించలేదు. అప్పటికే ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డును బ్లాక్ చేయాలని ఆయన దరఖాస్తులు బ్యాంక్ సిబ్బందికి ఇచ్చారు. వెంటనే స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న సిమ్‌ను తీసేసి కీప్యాడ్ ఫోన్‌లో వేశారు. దీంతో సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను హ్యాక్ చేయలేకపోయారు. 18వ తేదీన బ్యాంక్ సిబ్బంది, కాల్ సెంటర్ సిబ్బంది ఫోన్‌చేసి క్రెడిట్ కార్డుపై ఇన్‌స్టా లోన్ రూ.5 లక్షలు తీసుకున్నారని చెప్పారు. ఇది తన ప్రమేయం లేకుండా జరిగిందని, తన అకౌంట్‌లో జమ అయిన రూ.5 లక్షలను మినహాయించుకుని క్రెడిట్ కార్డుకు జమ చేసుకోవాలని నాగేశ్వరరావు చెప్పారు. ఆయన ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డును వెంటనే బ్లాక్ చేయడంతో సైబర్ నేరగాళ్లు డబ్బు లాగడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

26న బందరులో రైతులు, కార్మికుల ర్యాలీ

● విజయవంతం చేయాలని రైతు సంఘం పిలుపు

పెనమలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బందరులో ఈనెల 26న రైతులు, కార్మికులు నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పోరంకిలోని మానికొండ సుబ్బారావు, సూర్యవతి కార్మికుల కార్యాలయంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధమవుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదు నాగేశ్వరరావు, పంచకర్ల రంగారావు, మున్నంగి నరసింహారావు, ఉప్పాడ త్రిమూర్తులు, వాటపల్లి శ్రీరాములు, కిలారి ప్రసాద్, బుడ్డియ్య పాల్గొన్నారు.



బాపులపాడు శివాలయంలో ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం (ఇన్‌సెట్‌లో ప్రతిష్ఠించిన మరకత శివలింగం)

వైభవంగా శివాలయం పత్రిష్ఠ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాపులపాడు ధర్మ కోనేరు చెరువు గట్టుపైన నూతనంగా నిర్మించిన భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. మరకత లింగ ప్రతిష్ఠతో పాటు శిలా ధ్వజస్తంభం, భ్రమరాంబ అమ్మవారు, వీరభద్రస్వామి, నందీశ్వరుడు ద్వారపాలకులు, భక్తాంజనేయుడు, విజయ గణపతి, సిద్ధి గణపతి, చండీశ్వర, సప్తశీర్ష నాగదేవత, శివపార్వతులు, ఉత్సవాల విమాన శిఖర కలశం ప్రతిష్ఠా కార్యక్రమాలను వేద మంత్రాల మధ్య వేద పండితులు ఆర్వపల్లి బుచ్చిరామశర్మ, కోసూరి మురళీ కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ముముక్షు జన మహాపీఠాధిపతి గౌరకృష్ణ నిర్వహించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పోరంకిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెనమలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోరంకిలో పాలడుగు భార్గవ్‌చౌదరి, బొబ్బా శ్రీకాంత్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రాంతానికి ఎన్టీఆర్ గార్డెన్స్‌గా నామకరణం చేశారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, శొంఠి శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శివరాం ప్రసాద్

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శొంఠి శివరాం ప్రసాద్

పెనమలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా శొంఠి శివరాంప్రసాద్ నియమితులయ్యారు. పోరంకిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను బుధవారం ఆయన కలిశారు. తనకు పదవి రావడంలో సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా దయాల రాజేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు నియమితులయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు బుధవారం రాజేశ్వరరావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాజేశ్వరరావుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



రమణను సత్కరిస్తున్న ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు

ఉత్తమ ఉపాధ్యాయుడు రమణకు సత్కారం

ఉయ్యూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జీవీ రమణను యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణకు ఎంఈవో బి.సుధారాణి, నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుమంత్, రిటైర్డు హెచ్‌ఎం విశ్వమోహన్ యూటీఎఫ్ నాయకుడు పీవీ రమణ, రవికాంత్ అభినందనలు తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్ సస్పెన్షన్

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద పీహెచ్‌సీలో పని చేస్తూ వెలగలేరు పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై వెళ్లిన హెల్త్ అసిస్టెంట్ కొండపల్లి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు కుటుంబ వివాదాలు ఉండటంతో పోలీసు కేసులు అయ్యాయి. దీనిపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'పశువులకు సంక్రమించే బ్రూసెల్లోసిస్ వ్యాధి వల్ల రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. అందుకే ప్రభుత్వం జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం ద్వారా పెయ్యదూడలకు టీకాలు వేస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.' అని బాపులపాడు మండల సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. బండారుగూడెంలో పెయ్యదూడలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కంకిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా టీడీపీని ప్రజలు ఆదరిస్తున్నారని, పెనమలూరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు వేగంగా సాగుతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. బుధవారం కంకిపాడులో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. పులి శ్రీనివాసరావు, చలవాది రాజా, షేక్ బాజి, టింబర్ మురళి, కాకుమాను రమేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

ఆయుష్మాన్ భారత్ రాష్ట్ర బృందం నోడల్ అధికారి డాక్టర్ నరేష్

ఉంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, ఆయుష్మాన్ భారత్ రాష్ట్ర బృందం నోడల్ అధికారి డాక్టర్ నరేష్ అన్నారు. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పీహెచ్‌సీల పరిశీలనలో భాగంగా బుధవారం ఇందుపల్లి పీహెచ్‌సీని డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలోని బృందం సందర్శించింది. ఆస్పత్రిలో పలు రికార్డులు, రిజిస్టర్లను బృందం తనిఖీ చేసింది. సిబ్బందికి పలు సూచనలు చేసింది. తొలుత ఆస్పత్రి ప్రాంగణమంతా కలియతిరిగిన బృందం డెలివరీ రూమ్, ఆపరేషన్ థియేటర్, మందుల గది, ల్యాబ్ రూమ్‌లను పరిశీలించింది. రోగులకు అందుబాటులో ఉంచిన మందులు, ల్యాబ్‌లో చేస్తున్న టెస్టులపై ఆరా తీసింది. 64 ల్యాబ్ టెస్టులకు బదులు 44 జరుగుతున్నాయని, 172రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు బృందానికి వివరించారు. వైద్యసేవలను మరింత విస్తృతపరిచేందుకు కావాల్సిన వస్తువులు, వైద్యపరికరాలపై సిబ్బందితో సమీక్షించారు. వైద్యాధికారులు డాక్టర్ బి.శిరీష, డాక్టర్ వీవీ సుబ్బారావు పాల్గొన్నారు.



చిన ఓగిరాల పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి



ఇందుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో ఆయుష్మాన్‌భారత్ రాష్ట్ర బృందం

పీహెచ్‌సీల తనిఖీ

ఉయ్యూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి బుధవారం తనిఖీ చేశారు. చిన ఓగిరాల పీహెచ్‌సీలో ఓపీ, ఇన్‌పేషెంట్ల వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం అంతా కలియ తిరిగి పరిశుభ్రతను పరిశీలించారు. రికార్డులు, మందుల నిల్వలపై ఆరా తీశారు. ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలు, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక కేంద్రం వైద్య అధికారి తేజస్వి, ఇతర వైద్యులు, సిబ్బందిని పలు అంశాలపై ప్రశ్నించారు. ఉయ్యూరులో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు.

తిరుపతి, జగదల్పూర్‌కు బస్సు సర్వీసులు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, జగదల్పూర్‌కు బస్సు సర్వీసులను బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నూతన సర్వీసులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయని తెలిపారు. మునుపెన్నడూ ఇలాంటి దారుణమైన రోడ్లను చూడలేదన్నారు. త్వరలో మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లే ల్యాండ్ కంపెనీ పునఃప్రారంభం కానున్నదని వేలాది మందికి ఉద్యోగ అవకాశాలతో పాటు నూతన బస్సులు తయారీ మొత్తం ఇక్కడే జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఆర్టీసీ డీపీటీవో వాణిశ్రీ, డిపో మేనేజర్ శివాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐడీ విజయవాడ రీజనల్ అదనపు సూపరింటెండెంట్ డి.ప్రసాద్

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

కంకిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టాలు, వాటిలో వస్తున్న మార్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐడీ విజయవాడ రీజనల్ అదనపు సూపరింటెండెంట్ డి.ప్రసాద్ అన్నారు. గొల్లగూడెంలోని ఆర్సీఎం పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సును బుధవారం ఆయన నిర్వహించారు. సర్పంచ్ నత్తా దుర్గాభవాని, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి ఎం.ఫణిదూర్జటి, ఎంపీడీవో పి.అనూష, తహసీల్దార్ వి.భవన్నారాయణ, డీవైఈవో ఎం.పద్మావతి, ఎంఈవో బీవీ శేషగిరిరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల ధర పెంచినందుకు చలసానికి కృతజ్ఞతలు

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయడెయిరీ పాల ధరను డిసెంబరు 1వ తేదీ నుంచి 10 వెన్న శాతం గల పాలకు ఒక లీటరుకు రూ.80 నుంచి రూ.82కు పెంచినట్లు క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అన్ని సంఘాల అధ్యక్షులు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారని ఆయన పేర్కొన్నారు. వరదల్లో పాల ప్రాజెక్టుకు అపార నష్టం వచ్చినా రెండో విడత బోనస్‌గా రూ.12కోట్లు ప్రకటించారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.1300 కోట్లు లక్ష్యం పెట్టుకున్నట్టు పేర్కొన్నారు.



ధాన్యం లారీకి జెండా ఊపి మిల్లుకు పంపుతున్న టీడీపీ నాయకుడు కొమ్మినేని శ్రీనివాసరావు, వణుకూరు రైతులు

ధాన్యం తోలిన 48 గంటల్లోనే నగదు జమ

● కూటమి ప్రభుత్వ పనితీరుపై రైతుల్లో సంతోషం:
తెలుగురైతు జిల్లా నాయకుడు కొమ్మినేని శ్రీనివాసరావు

కంకిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వ హయాంలో వైసీపీ అనాలోచిత నిర్ణయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మిల్లులకు తోలిన ధాన్యం డబ్బులు ఎప్పుడు పడతాయో తెలిసేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిల్లులకు ధాన్యం తోలిన 48 గంటల్లోనే నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతోంది. కూటమి ప్రభుత్వ పనితీరుపై రైతులు సంతోషంగా ఉన్నారు.' అని తెలుగురైతు జిల్లా నాయకుడు కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. వణుకూరులో రైతుల నుంచి సేకరించిన ధాన్యం లారీకి ఆయన జెండా ఊపి మిల్లుకు తరలించారు. పిడికిడి శ్రీనివాసరావు, సుంకర రమేష్, ఉప్పలూరు కేశవరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఉయ్యూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సురేశ్, మండల వ్యవసాయ అధికారి నిస్సీ గ్రేస్ బుధవారం పరిశీలించారు. కలవపాములలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం శాంపిళ్లలో తేమను పరిశీలించి సూచనలు చేశారు. బోళ్లపాడు, ముదునూరులో ధాన్యం కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం తీసుకొచ్చే రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆర్ఐ యతేంద్రియులు అధికారుల వెంట ఉన్నారు.

దత్త పాదుకా నిలయంలో శ్రీ చక్రపూజ

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేసరపల్లి శ్రీ దత్త పాదుకా నిలయంలో శ్రీ దత్త విజయానందస్వామీజీ పర్యవేక్షణలో బుధవారం శ్రీ చక్రపూజ నిర్వహించారు. ఉదయం షోడస స్తంభ పూజ అఖండ దీపస్థాపన, సర్వతో భద్ర మండల దేవతా ఆహ్వానం, ప్రధాన కలశస్థాపన, బ్రహ్మకలశ స్థాపన, ఆవాహిత దేవతాపూజ, కుండ సంస్కారం, అగ్ని ముఖ ప్రయోగం చేశారు. సాయంత్రం అర్చనలు, ఆవాహిత దేవతాపూజ, సహస్రనామ అర్చన నీరాజన మంత్రపుష్పాలు అష్టావధాన సేవ చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు.

పశువైద్య శిబిరం

ఉంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భోత్పత్తి సమస్యలను నివారించడంద్వారా పాడిపరిశ్రమను లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ జిల్లా డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా అల్లాపురం పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నారయ్యఅప్పారావుపేటలో పశువులకు గర్భకోశవ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. శిబిరంలో 73 చూడి నిలవని పశువులకు పరీక్షలు చేసి, చికిత్సలు చేశారు. పశుగణనలో పాడిరైతులందరూ తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.బాలకృష్ణ సూచించారు. సర్పంచ్ నాగరాజు, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, స్థానిక టీడీపీ నాయకులు రాము, రాధాకృష్ణ, జనసేన నాయకుడు నరసింహులు పాల్గొన్నారు.

చిత్రకళలో చిన్నారి ప్రతిభ

● మూడున్నర గంటల్లో 81 ప్రమిదలపై పెయింటింగ్స్ వేసి అందరినీ అబ్బురపరిచిన ఆరేళ్ల వేక్షిత శివ

పెనమలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 81 ప్రమిదలపై మూడున్నర గంటల్లో పెయింటింగ్స్ వేసి ఆరేళ్ల చిన్నారి వేక్షిత శివ రికార్డు సృష్టించింది. పెనమలూరు గ్రామానికి చెందిన కిలారు నాగ త్రినాథ్, దివ్యశ్రీల కుమార్తె వేక్షిత శివ రెండో తరగతి చదువుతోంది. కూతురుకు చిత్ర కళ నేర్పించాలని తల్లిదండ్రులు ఒక ప్రైవేటు చిత్రకళ అకాడమీలో చేర్పించారు. ఆ అకాడమీ శిక్షకుడు శివ చిన్నారిలోని పట్టుదలను గమనించి కొత్తదనం కోసం ప్రమిదలపై బొమ్మలు వేయడంలో శిక్షణ ఇప్పించారు. మంగళవారం మూడు గంటలకు ప్రమిదలపై పెయింటింగ్స్ వేయడం ప్రారంభించి సాయంత్రం ఆరున్నర గంటల వరకు వేసింది. అందులో దేవుళ్లు, మనుషులు, కూరగాయలు, పండ్ల చిత్రాలు ఉన్నాయి. తల్లిదండ్రులు 50 ప్రమిదల పైన పెయింటింగ్స్ వేస్తే సరిపోతుందనుకుంటే చిన్నారి 81 ప్రమిదలపై వేసి, అందరినీ ఆశ్చర్యపరిచింది. వేక్షిత శివను అందరూ అభినందించారు.



పెయింటింగ్స్‌తో వేక్షిత శివ

బస్సు ఢీకొని వ్యవసాయ కూలీ మృతి

ఉయ్యూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యవసాయ కూలీ మరణించాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపక్కన గండిగుంటవద్ద సర్వీసు రోడ్డుపై జరిగింది. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. గండిగుంట ఆనందపురానికి చెందిన కర్రా రాంబాబు (54) ద్విచక్రవాహనంపై ఉయ్యూరు నుంచి ఇంటికి వెళుతుండగా నాగాయలంక నుంచి విజయవాడ వెళుతున్న బస్సు ఢీకొంది. దీంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. కూలి పనులు చేసుకుని జీవనం గడుపుతున్న రాంబాబుకు భార్య చిన్న పాప, బాబు ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసునమోదు చేశారు.

అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా

అనుమతులు లేకుండా మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడి నిర్మాణాలు

● గతంలో పట్టించుకోని అధికారులు ● ప్రభుత్వాదాయానికి గండి


అక్రమ కట్టడాలను జేసీబీతో కూల్చివేస్తున్న అధికారులు

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా, సీఆర్‌డీఏ అనుమతులు తీసుకోకుండా నిర్మించిన మిత్రా దాబా, వండర్ వరల్డ్ కిడ్స్ ప్లే జోన్, క్రికెట్ ప్రాక్టీస్ సెంటర్‌ను తొలగించారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడు మాజీ వైస్ ఎంపీపీ గొంధి పరంధామయ్యకు జాతీయ రహదారి వెంట బుద్ధవరం పంచాయతీ పరిధిలో సపోట తోట ఉంది. దాని పక్కనే కొంత వాగు పోరంబోకు ఉండటంతో దాన్ని ఆక్రమించి వ్యాపారాలకు అద్దెకిచ్చారు. భూమిని ల్యాండ్ కన్వర్షన్‌కు పెట్టకుండా, సీఆర్‌డీఏ అనుమతులు లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. పలుమార్లు సీఆర్‌డీఏ, పంచాయతీ అధికారులు నోటీసులు పంపినా స్పందించలేదు. దీంతో బుధవారం తెల్లవారుఝామున తహసీల్దారు కేవీ శివయ్యతో పాటు సీఆర్‌డీఏ, పంచాయతీ అధికారులు, పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. జేసీబీతో కట్టడాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ అధికారి సాయిలీల మాట్లాడుతూ సీఆర్‌డీఏ అనుమతి లేదని 4 నెలల క్రితం నోటీసు జారీ చేశామన్నారు. దానికి స్పందన లేకపోవటంతో మళ్లీ ఇచ్చామన్నారు. అయినా స్పందించకపోవటంతో ఉన్నతాధికారులకు చెప్పగా, వారి ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను తొలగించామన్నారు. పంచాయతీ కార్యదర్శి సరోజిని మాట్లాడుతూ 10సెంట్ల వాగు పోరంబోకు ఆక్రమణ, ఆర్ఎస్ నెంబర్ 3-1 పట్టా భూమి 94సెంట్లులో అనధికార నిర్మాణం వాణిజ్య సముదాయాలున్నాయని వాటికి ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. ల్యాండ్ కన్వర్షన్ కట్టకుండా ప్రభుత్వాదాయానికి గండి కొట్టారని దీనిపై చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

● కనకదుర్గానగర్‌లో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు: ఈవో


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి దర్శనం కోసం దుర్గగుడికి వచ్చే భక్తులకు కనకదుర్గానగర్‌లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించిన దుకాణదారులపై చర్యలు తీసుకుని ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఈవో కేఎస్ రామారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఈవో కనకదుర్గానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కనకదుర్గానగర్ ప్రధాన గేటు పక్కనే ఉన్న క్యాంటీన్, మరో దుకాణాన్ని పరిశీలించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తూ స్థలాన్ని ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన పూజా సామగ్రి, ఇతర వస్తువులను తొలగించాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం ఈఈవో రత్నరాజు, సూపరింటెండెంట్ నగేష్ తమ సిబ్బందితో క్యాంటీన్, మరో షాపు నిర్వాహకులు ఆక్రమించి ఏర్పాటు చేసిన సామగ్రి, బల్లలను తొలగించారు. దేవస్థానం నిర్ణయించిన స్థలాన్ని మాత్రమే వినియోగించుకోవాలని షాపుల నిర్వాహకులకు సూచించారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి

రైతు సంఘం రాష్ట్ర నేత బెనర్జీ

చల్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు అమరుస్తున్న ఆదానీ స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నేతలు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా బుధవారం చల్లపల్లిలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ వారం నుంచి వినియోగదారుల అనుమతి లేకుండా వ్యాపార సంస్థలకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, తర్వాత గృహాలకు, వ్యవసాయానికి సైతం మీటర్లు బిగించే యోచనలో ప్రభుత్వం ఉందని, ఈ విధానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు సీపీఐ, రైతు సంఘంగా వ్యతిరేకించామని, అప్పుడు మద్దతిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు వంత పాడటం దారుణమన్నారు. ఈప్రక్రియను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం నేతలు చంద్ర సుబ్బారావు, కొర్రపాటి ముఖర్జీ, గోగినేని రత్తయ్య, మల్లుపెద్ది బోసు, సీపీఐ నేతలు అల్లూరి బాబురావు, డొక్కు శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీను, నాగమల్లి, సిద్దాబత్తుల వాసు, పెన్మత్స రాజారత్నం స్మార్ట్ మీటర్ల బాధితులు పట్నాల రాజా, కె.రవి పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధికి శ్రీశైలం 1008వ జగద్గురు




మహాస్వామీజీకి స్వాగతం పలుకుతున్న ఈవో, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే గంటా, నటుడు అశోక్‌కు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ఈవో

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం 1008వ జగద్గురు డాక్టర్ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈవో రామారావు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి, తదితరులు సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అందించారు. అమ్మవారిని, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయనకు వేద పండితులు వేద స్వస్తి పలికారు. ఈవో రామారావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి అయనకు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. పండ్లు, పూలు సమర్పించారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యే

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను బుధవారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ఆశీర్వచనం, చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్ కుమార్ బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు, ఆశీర్వచనం ఇచ్చారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారులు బృందం బుధవారం దుర్గగుడి కళావేదికపై గురువు రాధికా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. 19 మంది కళాకారుల బృందం వివిధ కీర్తనలకు చక్కని అభినయం చేశారు. భావ, రాగ, తాళ యుక్తంగా చక్కని భంగిమలతో నాట్యం చేసి అలరించారు. ఆహూతుల హర్షధ్వానాలు అందుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారుల బృందాన్ని అభినందించి సర్టిఫికెట్లు, ప్రసాదాలు అందజేశారు.



లారీ ఓనర్స్ అసోసియేషన్

కార్యాలయానికి తాళం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



విద్యాధరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు తాళం వేశారు. వీఎంసీ పరిధి భవానీపురంలోని లారీస్టాండ్ ప్రాంగణంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కొన్నేళ్లుగా కొందరు భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించి వ్యాపార లావాదేవీలు చేస్తున్నారు. కార్పొరేషన్‌కు ఎలాంటి రుసుము చెల్లించటం లేదు. దీంతో వీఎంసీ ఆదాయానికి గండిపడుతోంది. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో లారీ స్టాండ్‌లో అక్రమ వసూళ్ల కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్టేట్ విభాగం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది లారీ స్టాండ్ వద్దకు వెళ్లి అసోసియేషన్ కార్యాలయానికి తాళం వేశారు. అయితే రాత్రి సమయంలో తాళాన్ని కొందరు పగులకొట్టేందుకు ప్రయత్నించగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మొదలైన రాజకీయ ఒత్తిళ్లు

అసోసియేషన్ కార్యాలయానికి అధికారులు తాళం వేయటంతో వారిపై రాజకీయ ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. కార్యాలయానికి వేసిన తాళాన్ని తీసివేయాలని అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధి, లారీ ఓనర్స్ అసోసియేషన్‌లోని పలువురు నేతలు ఒత్తిడి చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకే తాళం వేశామని, ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటామని అధికారులు చెప్పినట్టు తెలిసింది. గతంలోనూ 2 సార్లు తాళం వేయగా ప్రజా ప్రతినిధి, పలువురు నేతల ఒత్తిడి మేరకు తాళం తీసినట్టు అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారి పక్కన రూ.కోట్ల విలువైన ఖాళీస్థలంలో ఏదైనా కాంప్లెక్స్ నిర్మించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రాంగణానికి వెళ్లి సర్వే చేసినట్టు సమాచారం.

మూడేళ్ల కాలపరిమితి

సర్క్యులర్‌ను రద్దు చేయండి

వీవోఏ జిల్లా గౌరవాధ్యక్షురాలు కమల


ధర్నా చేస్తున్న వీవోఏలు

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు యానిమేటర్స్ (వీవోఏ) ఉద్యోగుల సంఘం, (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షురాలు ఎస్.కె.చాంద్ బేగం అధ్యక్షత వహించగా గౌరవాధ్యక్షురాలు ఎ.కమల, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల రమాదేవి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ వెలుగు (డీఆర్‌డీఏ) డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న డ్వాక్రా వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ని గత వైసీపీ ప్రభుత్వం 2019లో తెచ్చిందన్నారు. దీంతో 15ఏళ్లకు పైగా ఇదే ఉపాధిపై ఆధారపడిన వీవోఏల కుటుంబాలు, రోడ్డున పడతాయని ఈ వయసులో వేరే ఉపాధి దొరకడం కష్టమని, గత ప్రభుత్వానికి అనేక సార్లు విన్నపాలు, నిరసనలు, ఆందోళన ద్వారా తెలిపామన్నారు. దీంతో అమలును నిలిపేసిందన్నారు. దీనిపై ఎన్నికలకు ముందు ధర్నా చౌక్‌లో పెద్దయెత్తున ఉద్యమం చేస్తుండగా టీడీపీ తరపున వర్ల రామయ్య స్వయంగా హాజరై తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, సర్క్యులర్‌ని రద్దు చేస్తామని, చంద్రబాబు తన మాటగా చెప్పమన్నారని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి రాగానే సర్క్యులర్ రద్దు చేయకపోగా, ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సర్క్యులర్ ఆధారంగా, మూడేళ్లు పూర్తయిన వీవోఏని మార్చుకోవచ్చని, పత్రికా ప్రకటనలు చేయడం సరైంది కాదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అనేక మందిని, ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 200 మందిని తొలగించారన్నారు. టీడీపీ ఇచ్చిన హామీ ప్రకారం సర్క్యులర్‌ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, నేతలు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, వీవోఏ యూనియన్ నేతలు పి.రోజా, వి.దేవి, కె.సుమలత పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల సవరణకు సహకరించండి: కలెక్టర్


నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23, 24న ఓటర్ల జాబితాల సవరణకోసం పోలింగ్‌బూత్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీల నేతలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో ఓటర్ల జాబితాల సవరణపై రాజకీయ పార్టీల నేతలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా గతనెల 29న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించడం జరిగిందన్నారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18ఏళ్లు నిండి, లేదా 2025 జనవరి 1 నాటికి 18వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన వారిని నూతన ఓటర్లుగా చేర్చేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. నూతన ఓటర్లను చేర్చేందుకు, లేదా ఓటర్ల పేర్లలో తప్పులు సరిచేసేందుకు, చిరునామా మార్పు, ఓటర్ల చేర్పులు, మార్పులకు ఈనెల 23,24న పోలింగ్ కేంద్రాలవద్ద ఫారం-6,7,8 దాఖలు చేయవచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించి 1 జనవరి 2025 నాటికి ఓటర్ల జాబితాలను ప్రచురించేందుకు ఎన్నికల సంఘం అనుమతి కోసం పంపి, జనవరి 6న తుది ఓటర్ల జాబితాలను ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో 15,38,938 మంది ఓటర్లున్నారని, పురుష ఓటర్లు 7,45,775 మంది, మహిళా ఓటర్లు 7,93,108 మంది, ఇతర ఓటర్లు 55 మంది ఉన్నట్టు ఆయన తెలిపారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లుగా 61,187 మంది నుంచి దరఖాస్తులు అందాయని, వీటిలో 429 దరఖాస్తులను ఇంకా పరిశీలించాల్సి ఉందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల కోసం జిల్లాలో గతంలో 50 పోలింగ్ కేంద్రాలుండగా, 71కి పెంచామన్నారు. ఈ ఓటర్ల జాబితాలను ఈనెల 23న ప్రకటిస్తారని, డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు. డిసెంబరు 30న తుదిజాబితా ప్రకటిస్తామన్నారు. బీఎస్పీ ప్రతినిధి మచిలీపట్నం హైస్కూలులో 2వేల మందికి మించి ఓటర్లున్నారని, ఇతర పోలింగ్ కేంద్రాల్లో కొంతమంది ఓటర్లను సర్దుబాటు చేయాలన్నారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రహ్మణ్యం, షారోన్ వివిధ రాజకీయపార్టీల నేతలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని రూ.కోటి వసూలు

● మధ్యవర్తిగా ఉన్న మహిళ ఆత్మహత్యాయత్నం

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లు ఇప్పిస్తానని మోసం చేసి రూ.కోటి వసూలు చేసిన ఐదుగురు వ్యక్తులపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మేడూరి భాగ్యలక్ష్మి వాంబేకాలనీ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతంలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. ఆమెకు స్థానిక మహిళలతో సత్సంబాధాలున్నాయి. 2020లో స్థానికంగా ఉండే కొల్లాటి తిరుమలరావు మరో నలుగురు వ్యక్తులు టిడ్కో ఇళ్లు ఇచ్చే అధికారులు తమకు తెలుసని చెప్పారు. దీంతో ఆమె స్థానికంగా ఉండే అనేక మంది వద్ద సుమారు రూ.కోటి వరకు వసూలు చేసింది. నాలుగేళ్లు పూర్తయినా ఇళ్లు రాకపోవడంతో డబ్బులిచ్చిన వారంతా భాగ్యలక్ష్మిపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో బుధవారం ఆమె ఇంట్లో ఉన్న థైరాయిడ్ మందులు అధిక మొత్తంలో మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన భర్త సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానికంగా ఉండే కొల్లాటి తిరుమలరావు, పత్తిపాటి చందు, పత్తిపాటి కల్యాణి, కొల్లాటి హరిబాబు, కొల్లాటి నాగరాజు టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని తనను మోసగించి డబ్బులు కాజేశారని బాధితురాలు పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఎఫ్‌సీఐ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ప్రాంతీయ కార్యాలయం అమరావతి తరపున ఎన్టీఆర్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో 4వ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీని ఈ నెల 21,22న నున్నలోని గ్రీన్‌ఫీల్డ్ క్రికెట్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో శ్రీకాకుళం, వైజాగ్, కాకినాడ, తాడేపల్లిగూడెం, విజయవాడ, నెల్లూరు, కర్నూల్ సంబంధించిన 7 టీమ్‌లతో పాటు అమరావతి టీమ్ ప్రాంతీయ కార్యాలయంతో కలిపి మొత్తం 8 టీమ్‌లు పాల్గొంటాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ యాదవ్ హాజరై ప్రారంభిస్తారు.

రేపు కృష్ణా వర్శిటీ చెస్ టోర్నీ

విజయవాడలోని సప్తగిరి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాలల మహిళా చెస్ టోర్నీకమ్ సెలక్షన్స్‌ను మచిలీపట్నంలో కృష్ణా వర్శిటీ క్యాంపస్ రుద్రవరంలో నిర్వహించనున్నట్టు కేఆర్‌యూ చెస్ టోర్నీ చైర్‌పర్సన్ పీవీడీ శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు అర్హతా పత్రాలతో వేదిక వద్ద అదేరోజు ఉదయం 10 గంటలలోగా రిపోర్టు చేయాలన్నారు.

రేపు పార్శిళ్ల బహిరంగ వేలం

బస్టేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ పార్శిల్ ఆఫీసులో చిరునామాదారులు తీసుకువెళ్లని లేదా గుర్తించని పార్శిళ్లను ఈనెల 22న బహిరంగ వేలం వేయనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగల పాటదారులు వేలంలో పాల్గొనాలని కోరారు.

బీసీల సంక్షేమం బాబుకే సాధ్యం

● రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం

సత్యనారాయణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. అయోధ్యనగర్ నుజివీడు రహదారిలోని నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి పాటుపడింది చంద్రబాబేని, దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు రూ.15వేల జీతాన్ని రూ.20 వేలకు పెంచారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నాయీబ్రాహ్మణ సంఘం డైరెక్టర్లు సురవరపు నాగరాజు, పి.విజయకుమార్, నేతలు ఇంటూరి మురళీకృష్ణ, నిడమానూరు యలమందరావు, సందీప్ పాల్గొన్నారు.

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

● వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధానకార్యదర్శి కోటేశ్వరశర్మ

సత్యనారాయణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాల సంపదను వారి శ్రేయస్సు కోసమే ఉపయోగించాలని విశ్వ హిందూపరిషత్ కేంద్రీయ సంయుక్త ప్రధానకార్యదర్శి కె.కోటేశ్వర శర్మ అన్నారు. సత్యనారాయణపురం కొమ్మువారి వీధిలోని విశ్వ హిందూపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడతూ దేవాలయాల సంపదను ప్రభుత్వ సంక్షేమ, పాలనా కార్యకలాపాలకు వినియోగించవద్దని, హిందూ ధర్మప్రచారానికి, హిందూ ఉద్ధరణకు మాత్రమే ఉపయోగించాలన్నారు. దేవాలయాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కలిగించి హిందూ దేవాలయాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. రాష్ట్రప్రభుత్వాలు ఈ మేరకు చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి కొరతూ వీహెచ్‌పీ దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించామన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో హైందవ శంకారావం పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి, రక్షణ, సమాజ సంరక్షణకు జరగుతున్న హైందవ శంఖారావానికి లక్షలాదిగా హిందూ బంధువులు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్రకార్యదర్శి, హైందవ శంఖారావం కన్వీనర్ తనికెళ్ల సత్యరవికుమార్ పాల్గొన్నారు.


ఆర్చరీ రికర్వ్‌లో రజతం సాధించిన ఆర్చర్లతో చెరుకూరి సత్యనారాయణ

ఆర్చరీలో డాలీశివాని టీమ్‌కు రజతం

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం నాందేడ్‌లో ఈ నెల 10 నుంచి జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీలో సీబీఎస్ఈ గేమ్స్‌లో నగరంలోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న చెరుకూరి డాలీ శివానీ, ఆర్నవి రోహన్, వైదేహీ విజయ్ దతీర్, నవ్య రాజులదేవితో కూడిన టీమ్ రజతంతో సత్తా చాటింది. రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో రజతం సాధించినట్టు అకాడమీ చీఫ్ కోచ్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను కేకేఆర్ గౌతమ్ స్కూల్ యాజమాన్యం అభినందించింది.

వాస్తవ సంఘటనల సమాహారం 'కేసీఆర్'

● జబర్దస్త్ రాకేశ్



లబ్బీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేశవ చంద్ర రమావత్ చిత్రం ఒక ట్రైబల్ స్టోరీ అని, లంబాడీల జీవితశైలి, బావామరదలు కథ, తండ్రీ కొడుకుల మధ్య బంధమని హీరో జబర్దస్త్ రాకేష్ తెలిపారు. కేసీఆర్ చిత్ర బృందం బుధవారం నగరంలో సందడి చేసింది. ఈ నెల 22న చిత్రం విడుదల సందర్భంగా పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని మయూరి తెలుగు రుచులు హోటల్ నందు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్రానికి తెలంగాణలో కన్నా ఆంధ్రలో ప్రజాదరణ ఎక్కువగా ఉందని ఈ చిత్రంలో 4 పాటల్లో ఒక పాటని కేసీఆర్ ఆవిష్కరించారన్నారు. ఇది కేసీఆర్‌పై నిర్మించిన చిత్రం కాదని పూర్తిగా కుటుంబ కథా చిత్రమని తెలిపారు. ఈ చిత్ర కథ ఓ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల సమాహారమని, ఈ సినిమాకి ఎంతో గొప్పగా సాయం చేసిన దీపా ఆర్ట్స్ అధినేత శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. నటి సుజాత పాల్గొన్నారు.


ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ జీవీ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర ఎంఎస్‌వో, ఎల్ఎంవో, ఆపరేటర్స్

జీవీ రెడ్డికి ఆపరేటర్ల శుభాకాంక్షలు

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్‌నెట్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జీవీ రెడ్డికి రాష్ట్ర ఎంఎస్‌వో, ఎల్ఎంవో ఆపరేటర్లు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం జీవీ రెడ్డిని ఆపరేటర్లు కలిసి తమ సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. జీవీ రెడ్డి చైర్మన్‌గా ఉండటం వల్ల ఏపీఎస్ఎఫ్ఎల్‌పై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా జీవీ రెడ్డి స్పందిస్తూ ప్రధాన అంశాలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. చంద్రబాబు మానస పుత్రిక అయిన ఏపీఎస్ఎఫ్ఎల్‌ను రాష్ట్రంలోనే అత్యున్నతమైన నెట్‌వర్క్‌గా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తామన్నారు.


మాట్లాడుతున్న రచయిత సశ్రీ, చిత్రంలో గోళ్ల నారాయణరావు తదితరులు

జనాభాకు అనుగుణంగా లైబ్రరీలు రావాలి

● గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త లైబ్రరీలు ఏర్పాటు కావడం లేదని, ఉన్న కొద్దిపాటి గ్రంథాలయాలకు నేటికాలంలో విద్యార్థులు ఆశించిన సంఖ్యలో రావడం లేదని జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. బుధవారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నిర్వహణలో జాతీయ పుస్తక వారోత్సవాల్లో భాగంగా జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సశ్రీ మాట్లాడుతూ నేటి సమాజంలో యువతరం పాఠ్యపుస్తకాలకే పరిమితమవుతూ గ్రంథాలయాల్లో లభించే విశేష జ్ఞానానికి, సృజనకి దూరమవుతోందన్నారు. గ్రంథాలయాలు-సమాజం అన్న అంశంపై ఆయన మాట్లాడుతూ అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు ఇటీవలి గ్రంథాలయాలను నిర్లక్ష్యం చేయడం నాగరిక సమాజానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రంథాలయాలకు పూర్వవైభవం రావాలని శ్రీమతి లక్ష్మీ ఆకాంక్షించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ లక్ష్మయ్య స్వాగతం పలికారు. ప్రచురణకర్తలు పల్లవి వెంకట నారాయణ, జె.పి.పబ్లికేషన్స్ ప్రసాద్, దివి కుమార్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, పేరిశెట్టి శ్రీనివాసరావు, సుంకర నాగభూషణం పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు

వర్శిటీ బ్యాడ్మింటన్ చాంప్‌గా సిద్ధార్థ మహిళా కళాశాల

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాలల మహిళా బ్యాడ్మింటన్ విజేతగా శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల నిలిచింది. రన్నరప్‌గా పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్సు డిగ్రీ కళాశాల, 3,4 స్థానాల్లో సిద్ధార్థ లా కళాశాల, ఆంధ్ర లయోలా కళాశాల జట్లు నిలిచాయి. ఈ పోటీలు సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం జరిగాయి. రాత్రి జరిగిన ట్రోఫీల ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ కల్పన, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్ హేమ, కోచ్ వీ భాస్కరరావు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన కళాశాల విద్యార్థినులు రాజిని, ఉమామహేశ్వరి, ఎం సుచిత్ర ఈ నెల 26 నుంచి 28 వరకు బెల్గావిలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ ఉమెన్ బ్యాడ్మింటన్ చాంప్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ కల్పన తెలిపారు.

దేదీప్యమానంగా సహస్ర దీపాలంకరణ

కోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోడూరులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద బుధవారం సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కొమ్మూరు శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లింగాకారం, శంకు చక్రాలతో దీపాలు వెలిగించటంతో ప్రాంగణమంతా దేదీప్యమానంగా వెలుగొందింది. ధర్మకర్త బడే భావన్నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించగా, భక్తులు, స్వాములు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.575

ఔట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని సీఐటీయు కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షుడు బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆరునెలలుగా 15వ తేదీన జీతాలు అందుతున్నాయని ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు సిహెచ్. బుల్లెమ్మ మాట్లాడుతూ కార్మికులకు ఇవ్వవలసిన సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె ఇంతవరకు ఇవ్వలేదన్నారు.

వెంకటేశ్వరస్వామికి లక్ష తులసీ అర్చన



అవనిగడ్డ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ మండల పరిధిలోని వేకనూరులో అలివేలు మంగా సమేత సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరస్వామికి లక్ష తులసీ అర్చన బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డి.వి.కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పంచామృత గోక్షీరాభిషేకాలు చేశారు. అనంతరం లక్ష తులసీ దళాలతో పూజలు జరిపారు.

తీర ప్రాంత గ్రామాల్లో సీ విజిల్ ఎక్సర్‌సైజ్



ప్రత్యేక బోటులోమెరైన్, పోలీసులు

కోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలకు కొత్త వ్యక్తుల రాకపై అవగాహన కల్పించేందుకు సీ విజిల్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మచిలీపట్నం ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బందితో కోడూరు మండలం పాలకాయితిప్ప గ్రామ సమీపంలో సీ విజిల్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇండియన్ నేవీ, మెరైన్ పోలీస్ సంయుక్తంగా ఈ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో మండలి



ప్రసాదాలు బుద్ధప్రసాద్‌కు అందిస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ బుధవారం మోపి దేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలుకగా, నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సేవాభవన్ ప్రారంభం

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కె.కొత్తపాలెం గ్రామంలో గ్రామస్తుడు ఒంగోలులో స్థిరపడిన బుర్రె శ్యాంసన్ ఆర్థిక సాయంతో నిర్మించిన ప్రజా ప్రయోజనార్థ సేవాభవన్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం ప్రారంభించారు. పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ద్వారా శ్యాంసన్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, తెలుగు లోగిలి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పి.ఎస్.రావు ఉన్నారు.

పీహెచ్‌సీల్లో వైద్య బృందాల విస్తృత తనిఖీ

పెడన రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని జిల్లా ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం సూచించారు. పెడన, బల్లిపర్రు ఆరోగ్య కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. ఓపీ సర్వీస్, ఆధార్‌తో అనుసంధానం, ఉద్యోగుల సమయపాలన, రిజిస్టర్లు తనిఖీ చేశారు. కన్సల్‌టెంట్ గంగాధర్, డీపీవో శాస్త్రి, డాక్టర్ కె.మీనాదేవి పాల్గొన్నారు.

ఘంటసాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల పిహెచ్‌సిని వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ రత్నావళి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్, కన్సలెంట్ ప్రహర్షలు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ వారి ఆదేశాల మేరకు వారు ఈ పిహెచ్‌సిని తనిఖీ చే సినట్లు వారు తెలిపారు. వైద్యసేవలతోపాటు పిహెచ్‌సిలో సౌకర్యాలు తదితర విషయాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలోని అన్ని విభాగాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ వచ్చిన అధికారులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు గురించి చర్చించి అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు వేమూరి ప్రమోద్, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బల్లిపర్రు ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు మండలంలోని పెదక ళ్లేపల్లి, రావివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఉన్నత స్థాయి అధికారుల బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఎన్‌పిసిపి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ నాయక్, డాక్టర్ నాగజ్యోతిలతో కూడిన బృందం సభ్యులు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను రికార్డుల పరిశీలన ద్వారా తెలుసుకున్నారు. వైద్యసేవలు అందించే తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ లక్ష్మీనాథ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

చంద్రబాబుకు బూరగడ్డ పరామర్శ

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు సోదరుడు రామ్మూర్తినాయుడు పరమ పదించిన నేపథ్యంలో బుధవారం చంద్రబాబు నాయుడును మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పరామర్శించారు. రామ్మూర్తి నాయుడు మృతి తీరనిదన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడుతో వేదవ్యాస్ మచిలీపట్నం విశేషాలను మాట్లాడారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ

1977 నాటి ఉప్పెన నష్టాన్ని మరువలేం

హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ

మచిలీపట్నం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో 1977 నవంబరులో సంభవించిన తుపాను కారణంగా దివిసీమలో జరిగిన నష్టాన్ని మరువలేమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 47సంవత్సరాల క్రితం సంభవించిన తుపానుధాటికి దివిసీమలో 10వేలమంది ప్రాణాలు కోల్పోయారని, కోట్లాది రూపాయలనష్టం జరిగిందని ఆయన అన్నారు. అప్పట్లో స్వయంసేవక్‌గా తాను మరి కొంతమంది బృందంగా ఏర్పడి దివిసీమలో రెండు సంవత్సరాల పాటు ప్రజలకు సేవలు అందించామన్నారు. చనిపోయినవారికి అంత్యక్రియలను తమ బృందం నిర్వహించిందని ఆయన తెలిపారు. పూర్తిగా నష్ట పోయిన వారికి నిత్యావసరాలు, వంటసామాగ్రి, వైద్య సేవలను అందించడం జరిగిందన్నారు దివిసీమప్రాంతంలో అందుబాటులో ఉండి అనాధ పిల్లలను దత్తత తీసుకుని భారతీయఅనాథ శరణాలయాన్ని ప్రారంభించామని, పర్రచివర గ్రామంలో తాత్కాలిక గృహసముదాయాన్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. అప్పటిముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, విదేశాంగశాఖ మంత్రి అటల్‌బిహారీ వాజ్‌పాయ్ దివిసీమప్రాంతాన్ని పరిశీలించి ప్రజలలో ధైర్యం నింపారని అన్నారు. మండలి వెంకటకృష్ణారావు తుపాను బాధితులకు విశేషసేవలు చేశారని, ఆయన కుమారుడు బుద్ధప్రసాద్ తన త ండ్రి చూపిన బాటలోనే కొనసాగుతున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

విజయ పాల సేకరణ ధర పెంపుపై హర్షం

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ విజయ పాల సేకరణ ధరను పెంచటంపై కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు గోళ్ల పూర్ణమల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు మోపిదేవి, అవనిగడ్డ పరిధిలోని సంఘాల అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు.

బంటుమిల్లి, నవంబరు 20: కృష్ణా మిల్క్ యూనియన్ పాలసేకరణ ధర పెంపు పట్ల మండలంలోని పలు పాల సంఘాల అధ్యక్షులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్‌బాబుకు మల్లేశ్వరం, మలపరాజుగూడెం, నీలిపూడి, మండపల్లి, నారాయణపురం, సంఘాల అధ్యక్షులు పేపేటి వీరమ్మ, పుప్పాల శ్రీరామ్మూర్తి, పాశం శివనాగవరప్రసాదు, సుంకర సాయిబాబు, తిరుమల సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఓవరాల్ చాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు, వ్యాయామం సంపూర్ణ ఆరోగ్యం కలిగిస్తాయని ఏలూరు రేంజి ఐజీ జి.వి.జి.అశోక్ కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా స్పోర్ట్ మీట్ ముగింపు సందర్భంగా విజేతలకు ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఇదే క్రీడా స్ఫూర్తిని విధి నిర్వహణలో సైతం కొనసాగించాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనన్నారు. ఓటమి గెలుపునకు సోపానమన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఓవరాల్ విజేతగా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. వాలీబాల్ విజేతగా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు, రన్నర్‌గా గుడివాడ సబ్‌డివిజన్ పోలీసు జట్టు నిలిచారు. కబడ్డీ విజేతగా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు, రన్నర్‌గా అవనిగడ్డ జట్టు నిలిచాయి. టగ్ ఆఫ్ వార్‌లో విజేతగా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు , రన్నర్స్‌గా అవనిగడ్డ సబ్‌డివిజన్ పోలీసుల జట్టు నిలిచాయి.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏలూరు రేంజి ఐజీ అశోక్ కుమార్. చిత్రంలో ఎస్పీ గంగాధరరావు

మినుము విత్తనాలు సిద్ధం

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ద్వారా రెండవ పంటగా రైతులు సాగు చేసే మినుము విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారిణి కె.హెప్సిబా రాణి తెలిపారు. 2024 రబీ సీజన్‌కు గానూ 40 క్వింటాళ్లు 752 రకం విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొ న్నారు. కేజీ రూ.98 చొప్పున అందించనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కార్తీక వన సమారాధన

పెడన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భట్ల జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1972-73వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల కార్తీక వనసమారాధన శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఈ కార్తీక వనసమారాధనలో పాల్గొన్నారు. తొలుత పూర్వ విద్యార్థి సింగంశెట్టి ఆదినారాయణ, రజని దంపతులు వనపూజ చేశారు. అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

మృతుడు రాజాని ప్రసాద్‌గా గుర్తింపు

పెడన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెడన బైపాస్ రోడ్డులోని రైల్వేగేటు వద్ద మంగళవారం రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తిని పట్టణంలోని బ్రహ్మపురానికి చెందిన రాజాని ప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. చేనేత ఉప వృత్తి అయిన సరులు పని చేసే రాజాని ప్రసాద్ తాగుడుకు బానిసయ్యాడు. ఏడేళ్ల కిందట అతనికి భార్యతో తెగతెంపులయ్యాయి. ఈ నేపథ్యంలో రాజాని ప్రసాద్ మద్యం తాగేందుకు ఇంట్లో డబ్బులు అడిగాడు. ఇవ్వకపోవడంతో అలిగి క్షణికావేశంలో మంగళవారం మధ్యాహ్నం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

గాయపడిన వ్యక్తి మృతి

పెడన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌పై నుంచి కిందపడి గాయపడ్డ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఈ నెల 17న నడుపూరు నుంచి చేవేంద్రకు ఇసుకలోడుతో వెళుతున్న ట్రాక్టర్‌పై నుంచి హుస్సేన్‌పాలేనికి చెందిన శ్రీకాకుళపు ఆనందబాబు (30) చేవేంద్ర సమీపంలో ట్రాక్టర్ నుంచి కిందపడిపోయాడు. గాయపడ్డ ఆనందబాబును చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూనే అతను మృతి చెందాడు.

పుస్తక పఠనంతో ఉన్నత ఆలోచనలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో ఉన్నతమైన ఆలోచనలు వస్తాయని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న వారోత్సవాల ముగింపు సభలో కొనకళ్ల నారాయణరావు అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విజేతలకు నారాయణరావు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్, అప్పినీడి పోతురాజు, ఎస్. వెంకటేశ్వరరావు, ఉప గ్రంథాలయాధికారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఈడేపల్లిలో జరిగిన గ్రంథాలయ ముగింపు సభలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ పాల్గొని విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, న్యాయవాది అజ్మతున్నీసా, గ్రంథాలయ నిర్వాహకులు కోన వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో మనిషిలో విజ్ఞాన వికాసం కలుగుతుందని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం అవనిగడ్డ గ్రేడ్-1 గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి



సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎల్‌ఐసీ బ్రాంచి మేనేజర్ ఆకుల హరి ప్రసాద్, కూనపరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెడన రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, ప్రిన్సిపాల్ బిఆర్‌ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డి.రాజా రమేష్ పాల్గొన్నారు.

కోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం కోడూరు గ్రంథాలయ అధికారిణి వై.పుష్పలత ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. వివిధ విభాగాలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు.

పెయ్య దూడలకు వ్యాధి నిరోధక టీకాలు

నాగాయలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వక్కపట్లవారిపాలెంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు. పశువైద్యాధికారి సిహెచ్.సాయి మౌనిక నాలుగు నుంచి ఎనిమిది నెలలు నిండిన పెయ్య దూడలకు టీకాలను వేశారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దాం: బాబ్జీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని పీసీసీ ప్రధాన కార్యదర్శి, కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి ఎం. బాబ్జీ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో బాబ్జీ మాట్లాడారు. పార్టీ నూతన సమన్వయకర్తలు ప్రజా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలన్నారు. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యమని, క్రమశిక్షణ లేని వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందుతున్నది లేనిదీ పరిశీలించాలన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యుడ ధనేకుల మురళీమోహనరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహనరావు, మచిలీపట్నం సమన్వయకర్త అబ్దుల్ మతీన్, అవనిగడ్డ సమన్వయకర్త అందే శ్రీరామమూర్తి, పీసీసీ డెలిగేట్ కోకా ఫణిభూషణ్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న కొల్లు నీలిమ

మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి, కొల్లు ఫౌండేషన్ అధినేత కొల్లు నీలిమ అన్నారు. రోటరీ క్లబ్ ద్వారా కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని కొల్లు నీలిమ సందర్శి ంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నీలిమ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అండగా నిలుస్తుందన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకోవడం ద్వారా ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు లింగం మోజెస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి అనుపమ ముఖర్జీ, న్యాయవాది అజ్మతున్నీసా, పి.వి. ఫణికుమార్, విమల గాయత్రి పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లకు ఇసుక తరలించుకునే వెసులుబాటు కల్పించాలి

- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి మండలంలో నదీ తీర ప్రాంతాల్లో ఉండే ఎడ్లబండ్ల యజమానులు తీర ప్రాంతం వెంబడి ఉన్న ఇసుకను తరలించుకునే వెసులుబాటు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బండ్ల యజమానులతో కలసి రమేష్ బాబు బుధవారం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి బతుకులు మెరుగు పరుస్తామంటూ ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పేదవాడిని పట్టించుకోవటం లేదన్నారు. సిఆర్‌జెడ్ పేరు చెప్పి ఇసుకను తీసుకువెళ్లకుండా అడ్డుకుంటూ ప్రభుత్వం పేదవాడి పొట్ట కొడుతుందని మండిపడ్డారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోని నది తీర ప్రాంతాల్లో అమలు కానీ సిఆర్‌జెడ్ నియమ నిబంధనలు కేవలం ఒక్క చల్లపల్లి మండలంలోనే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం అంతట ఎద్దుల బండ్లపై ఇసుకను తరలించుకుని వెళ్తుండగా, కేవలం చల్లపల్లి మండలంలో మాత్రమే ఒక బండి ఇసుకను కూడా తీసుకెళ్లకుండా అడుపడ్డకోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కూడా సహృదయంతో అర్థం చేసుకుని ఎద్దుల బండిపై ఇసుక తోలుకునే వారికి ఒకటి, రెండు బండ్లు తీసుకుని వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

స్మశాన వాటికలో మందిర నిర్మాణం



మచిలీపట్నం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం చిన్నాపురం గ్రామ శివారు వెంకటాపురంలో స్మశాన వాటికకు మందిర నిర్మాణం చేపట్టారు. బుధవారం శ్లాబు వేసే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు పరిశీలించారు.

విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు

గుడివాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని శక్తి టీమ్ సభ్యులు గూడపాటి శిరీషా, నాగమణి హెచ్చరించారు. బుధవారం స్థానిక మహిళా కళాశాల, ఉన్నత పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్‌కు అభినందన

గుడివాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని మాల కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెదపూడి విజయ్‌కుమార్‌ను జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఇంటూరి గజేంద్ర, బట్టు రవికిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

డంపింగ్ యార్డులో స్వల్ప మంటలు

● వెంటనే స్పందించిన మున్సిపల్ సిబ్బంది.. అదుపులోకి మంటలు

గుడివాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ డంపింగ్ యార్డులో బుధవారం స్వల్పంగా మంటలు చెలరేగి పొగ కమ్మడంతో స్థానికుల ఫిర్యాదుపై మున్సిపల్ అధికారుల వెంటనే స్పందించారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది మున్సిపల్ నీటి ట్యాంకర్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, శానిటేషన్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ



గుడివాడ ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న వాకాటి కరుణ

గుడివాడ/గుడ్లవల్లేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ అన్నారు. బుధవారం గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రి, గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఏరియా ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. బ్లడ్ బ్యాంక్, ఆపరేషన్ థియేటర్లను సందర్శించారు. రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి ఉన్నారు. గుడ్లవల్లేరులో ఎన్‌సీడీ సీడీ సర్వే, ఆర్‌బీఎస్‌కే సర్వేలను వేగవంతంగా, నాణ్యతగా నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీలో ల్యాబ్‌లను, రికార్డులను ఆమె పరిశీలించారు. డీఎంహెచ్‌వో గీతాబాయ్, పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ నాయక్, డాక్టర్ యశశ్విని పాల్గొన్నారు.



తోట్లవల్లూరు పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న స్టేట్ క్లస్టర్ బృంద సభ్యులు

తోట్లవల్లూరు పీహెచ్‌సీ సందర్శన

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు పీహెచ్‌సీని స్టేట్ క్లస్టర్ టీమ్ బుధవారం సందర్శించింది. కెవిఎస్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, స్టేట్ కన్సల్టెంట్ ఆర్.వెంకటేష్, డీఎల్‌ఏటీవో డాక్టర్ వెంకటరావు పీహెచ్‌సీని సందర్శించి మందుల స్టోర్ రూమ్‌ని, ల్యాబ్, వ్యాక్సిన్ రూమ్‌లను, వార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.సాయిప్రసన్నను పలు వివరాలు అడిగి రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలు మెరుగుపర్చేందుకు తీసుకోవలసిన సలహాలను వారు డాక్టర్‌కు వివరించారు.

వెంట్రప్రగడలో రికార్డుల పరిశీలన

పెదపారుపూడి: వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రమాదేవి, కన్సల్టెంట్ నరేంద్ర తనిఖీ చేశారు. ఆఫీసులో అన్ని రూమ్స్, లేబర్ రూము, థియేటర్ వార్డు లేబరేటరీ మందుల గది, ఆఫీస్ రూములు పరిశీలించారు. ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నది లేనిది సర్వీసెస్ సక్రమంగా ఇస్తున్నది లేనిది రికార్డులు తనిఖీ చేశారు. డాక్టర్ బీవీఆర్.సందీప్, డాక్టర్ దివ్య కృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీలే లక్ష్యంగా పనిచేయాలి: డీపీవో అరుణ

పామర్రు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ పంచాయతీల లక్ష్యంగా గ్రామ కార్యదర్శులు సేవలందించాలని జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ అన్నారు. పామర్రు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీల సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. దీనికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో కార్యదర్శులు పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి దోహదపడే చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పంచాయతీలకు ప్రజల నుంచి రావాల్సిన పన్నుల బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను వారం లోపు పూర్తిచేయాల్సి ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ, తాగునీటి సరఫరా, గ్రామ విద్యుదీపాలు సక్రమంగా పనిచేసేల చర్యలు తీసుకోవాలన్నారు. హరిత విప్లవం కింద సేవలందించే గ్రీన్ అంబాసిడర్లకు చెల్లించవలసిన బకాయిలను చెల్లింపులు జరపాలన్నారు. పారిశుధ్యం లోపిస్తే చర్యలు తీసుకో వడం జరుగుతుందని హెచ్చరించారు. తొలిసారి పామర్రు మండలానికి విచ్చేసిన డీపీవోను ఎంపీడీవో కె.జ్యోతి, కార్యదర్శులు. పామర్రు, నిమ్మకూరు, జమీగొల్వేపల్లి, పసుమర్రు పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్‌సలీం, ఆర్ సుబ్రమణ్యం, పద్మశ్రీవేణి, గ్రేడ్-5పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

● అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు



గుడివాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూలు వేగవంతం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులతో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. పన్ను వసూళ్లను బాధ్యతగా చేపట్టాలని, కొత్త అసెస్మెంట్‌లపైన దృష్టి సారించాలన్నారు. పట్టణంలో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జోషి

శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్తు

పామర్రు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన కోసం శ్రమిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రాష్ట్ర ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి పిలుపునిచ్చారు. పామర్రు టీఎస్‌ఆర్ అండ్ ఈఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాది సెమిస్టర్ విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో మంచి నైపుణ్యం సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ కేఆర్‌జీ శేషకుమార్, డి.రవి, ఏ.మాధవి, ప్రభావతి, ఇ.సునీత, పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలి

● వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి రమణి



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా డీడీ జ్యోతిరమణి

గుడివాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి రమణి అన్నారు. బుధవారం సెరివేల్పూరు, బొమ్ములూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోతను మిషన్ ద్వారానే నూర్పిళ్లు జరుపుకుంటున్నారని, దీని వల్ల సమయం నగదు, ఖర్చు తగ్గుతుందని చెప్పారు. మినుము పైరుపై పల్లాకు తెగులు, తదితర తెగుళ్ల నివారణకు ముందుగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఏడీఏలు బి.పద్మజ, కె.శ్రీనివాసరావు, నిమ్మగడ్డ రమాదేవి, ఏవో బోలెం అనంతలక్ష్మి, సెరివేల్పూరు సర్పంచ్ మేడేపల్లి ప్రభాకర్, విఏఏ కె.దిలీప్ పాల్గొన్నారు.



బొడ్డపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరామ్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ప్రారంభించారు. తహసీల్దార్ ఎంకుసుమకుమారి, సర్పంచ్ మూడే శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు వార్తపై చర్యలు తీసుకుంటాం: ఎస్సై అర్జునరాజు



తోట్లవల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.అర్జునరాజు హెచ్చరించారు. బుధవారం విలేకరులతో ఎస్సై మాట్లాడుతు పెనమకూరులో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌పై స్వల్ప ఘర్షణ జరిగితే దాన్ని వక్రీకరించి ఎక్కడో హత్యాయత్నం జరిగిన వీడియోని జతచేసి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆ వీడియోలో ఉన్నది స్కూల్ బస్సు డ్రైవర్ కాదని తెలిపారు. ఈ అబద్ధపు వీడియో వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్ ఆధారంగా విచారించి తప్పుడు పోస్టు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.



పామర్రు బస్టాండ్‌లో ప్రారంభమైన పనులను పర్యవేక్షిస్తున్న ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు

బస్టాండ్ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి

● బందరు ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు

పామర్రు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పామర్రు బస్టాండ్ ఆధునీకరణ పనులు డిసెంబరు నెలాఖరు కల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు బందరు ఆర్టీసీ డీఎం టి.పెద్దిరాజులు వెల్లడించారు. అసంపూర్తిగా నిలిచిన పోయిన ఆధునీకరణ పనులపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ప్రజాప్రతినిధులు ఆదేశాలతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా బుధవారం ప్రారంభమైన పనులను ఆయన పరిశీలించారు. నేటి నుంచి తాత్కాలికంగా బస్టాండ్‌లోకి బస్సుల ప్రవేశాన్ని డిసెంబరు 5 వరకు నిలుపుదల చేస్తున్నామని ప్రకటించారు. దీనికి ప్రయాణికులు సహకరించాలని కోరారు. గతేడాది ఎన్నికల ముందు ఆధునీకరణ పనులు రూ.31 లక్షలతో తొలి విడతగా ప్రారంభించినట్లు తెలిపారు. వాటిలో ప్రధానంగా ప్రయాణికుల వెయిటింగ్ హాల్ అభివృద్ధికి వెచ్చించడంతోపాటు హోటల్ మరమ్మతులు నిర్వహించడమైందన్నారు. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ఆ తర్వాత ఇసుక కొరత వల్ల కాంట్రాక్టర్ పనుల నిర్వహణలో జాప్యం చేశారని పెద్దిరాజులు చెప్పారు. ఇంకా మిగిలిన పనుల నిర్వహణకు మరో రూ.32 లక్షలు వినియోగించవలసి ఉందన్నారు. బస్టాండ్ చుట్టు పక్కన గృహాల వారితోపాటు కొన్ని ప్రభుత్వ కార్యాలయాల వారు వినియోగించే మురుగు నీరు బస్టాండ్‌లోకి పైపుల ద్వారా మళ్లించడం వల్ల పనుల నిర్వహణకు ఆటంకాలు ఎదురౌతున్నాయని చెప్పారు. వాటిని నిరోధించడం కోసం ఆర్టీసీ లీగల్ సెల్ తరఫున సంబంధిత శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణ మెరక చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా పామర్రులోని నాలుగు రోడ్ల కూడలిలో నిర్దేశించిన ప్రదేశాల్లోని బస్సుస్టాప్‌లను వినియోగించుకోవాలని సూచించారు.



దూడలకు బ్రూసెల్లోసిస్ టీకా వేస్తున్న పశువైద్యులు

బ్రూసెల్లోసిస్ వ్యాధిపై అవగాహన అవసరం

● జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ చిననరసింహులు

గుడివాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి ఒకటని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ చిన నరసింహులు అన్నారు. పశువుల పాలలో బాక్టీరియాలు ఉండి మనుషులకు వ్యాధి సంక్రమించడం జరుగుతుందని, ఈ వ్యాధిపై అవగాహన అవసరమని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ చిన నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక బహుళార్థక పశువైద్యశాలలో ఈ నెల 20 నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు జరుగు బ్రూసెల్లోసిస్ టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్రావమైన పశువుల స్రావములను తాకటం వలన కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఉపసంచాలకులు డాక్టర్ పి.రత్నశ్రీ, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

గుడివాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు గుడ్లవల్లేరు పశుసంవర్ధకశాఖ ఏడీఏ ఏ.లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం సెరిగొల్వేపల్లిలో వైద్యశిబిరం జరిగింది. ప్రతీ రైతు తమ పశువులను, గొర్రెలను, మేకలకు టీకాలు వేయించుకోవాలని కోరారు. పశు సంవర్థక శాఖ ఏడీఏ ఉన్నం హనుమంతరావు, ఎంపీటీసీ అంగడాల సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల పరిశీలన



బొమ్ములూరులో లబ్దిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ గుమ్మడి రత్నశ్రీ

గుడివాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గృహనిర్మాణ లబ్ధిదారులంతా ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ గుమ్మడి రత్నశ్రీ అన్నారు. బుధవారం బొమ్ములూరు గ్రామంలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొమ్ములూరు గ్రామంలో 74 మంది గృహాలు నిర్మించుకుంటున్నారని, వారు త్వరగా నిర్మాణ పనులుపూర్తి చేయాలని కోరారు. ప్రతీ ఇంటికి వెళ్లి పనులు ఏ విధంగా జరుగుతున్నవి, వారికి ఏయే మెటీరియల్ కావాలో మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న మెటీరియల్ త్వరగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామోజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రావి వెంకటేశ్వరరావుకు కాపు సేవాసమితి సన్మానం

గుడివాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును గుడివాడ మండలం మల్లాయి పాలెంలోని శ్రీకృష్ణవేణి ఆగ్రో ఆయిల్ మిల్‌లోని రావి వ్యక్తి గత కార్యాలయంలో గుడివాడ కాపు సేవాసమితి సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపుసేవా సమితి సభ్యులు సుంకర గాంధీ, దారపురెడ్డి మణ్యేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్, పొన్నూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే రావి వెంకటేశ్వరరావును తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణ్యేశ్వర రావు ఘనంగా సత్కరించారు.



రావిని సత్కరిస్తున్న కాపు సేవాసమితి సభ్యులు